తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించండి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 9 ప్రభాతవార్త : నగరంలో పెండింగ్‌లో ఉన్న ఆస్థి పన్నులు, నీటి పన్నులు వసూలు చేసి నగరపాలక సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్ ఎన్. మౌర్య రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పన్నులు వసూళ్ల తదితర అంశాలపై కచ్చపి ఆడిటోరియంలో అడ్మిన్ సెక్రటరీలు, ఆమెనిటీ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, వేల్ఫేర్ సెక్రటరీలు, ఆయా విభాగాధిపతులతో శుక్రవారం కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో ఇంటి పన్నులు, నీటి చార్జీలు, భూగర్భ మురుగు చార్జీలు, ఖాళీ జాగా పన్ను బకాయిలు ఎక్కువగా ఉన్నాయని, వీటిని సకాలంలో వసూలు చేయాలని అన్నారు. రెవెన్యూ సిబ్బందితో పాటు, అడ్మిన్, అమెనిటి సెక్రటరీలు ఒక బృందంగా ఏర్పడి ఖచ్చితంగా పన్నులు వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. మొండి బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు ఇచ్చి వసూలు చేయాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుండి ఎక్కువ పెండింగ్ ఉన్నాయని చెప్పగా వారితో మాట్లాడి కొంత ఐనా వసూళ్లు చేయాలన్నారు. పన్నులను డిజిటల్ పద్ధతిలో చెల్లించేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. పన్నుల కాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, శ్రావణి, రాజు, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, కెఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య సుమతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతతోనే...
# సమాజంలో మార్పు

**-సిఆర్‌రెడ్డి, శ్యాం సుందర్‌రెడ్డి సేవాభావం కలిగిన వ్యక్తులు -మహిళ కళాశాల ఏర్పాటు చేయడం అభినందనీయం -మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు**



డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఎమ్మెల్యే తదితరులు

గూడూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త : మహిళలకు ప్రత్యేకంగా కళాశాల ఉండాలని 1981 సంవత్సరం లోనే ప్రముఖ వ్యాపారవేత్త ఆల్లారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్ సిఆర్‌రెడ్డి ఎంతో కృషి చేసి గూడూరు పట్టణంలో డిఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాలను తీసుకురావడం సంతోషంగా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఏర్పాటు చేసిన అల్లారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్ సిఆర్‌రెడ్డి విగ్రహాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ప్రముఖ వైద్యుల సిఎంకే రెడ్డి, పట్టణ ప్రముఖులు కాలేజీ యాజమాన్యం ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ సిఆర్ రెడ్డి జీవిత చరిత్ర గ్రంథాన్ని మాజీ ఉపరాష్ట్రపతి విడుదల చేశారు. పలువురు పట్టణ ప్రముఖులతో మాజీ ఉపరాష్ట్రపతి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ గూడూరు ప్రాంతం నుండి చెన్నైకి వెళ్లి ప్రముఖ వ్యాపారవేత్తగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆలోచనతో 1980 సంవత్సరంలో మహిళల కొరకు ప్రత్యేక కళాశాలను ఎంతో కష్టపడి ఏర్పాటు చేశారని అన్నారు. ఈనాడు కళాశాల రాష్ట్ర స్థాయిలో ఎంతో గుర్తింపు పొంది వేలాది మంది జీవితాలకు ఉన్నత బాట చూపించిందని పేర్కొన్నారు. వీరి విగ్రహాలు ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల ఈతరం రాబోయే తరాల వారికి స్ఫూర్తిని ఇస్తుందని అన్నారు. మహిళలు చదువుకోవడం వల్ల కుటుంబం ఎంత అభివృద్ధి చెందుతుందని డాక్టర్ సిఆర్ రెడ్డి లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని వారికి తోచిన సహాయ కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. ఎక్కడైతే మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలు ఉంటారని అన్నారు. స్కంద పురాణంలో పిల్లలు ఒక్కటే ముఖ్యం కాదని బావి చెరువు చలివేంద్రం చెట్టు మండపం వల్ల మనిషికి ఎంతో ఉపయోగం ఉందని వివరించారు. ఇష్టమైన పనిని కష్టమైనా సరే ఇష్టపడి పని చేస్తే నష్టపడేది లేదన్నారు. సామెత ఎందరినో ఆకట్టుకుంది. శ్యామ్ సుందర్ రెడ్డి సిఆర్ రెడ్డిలు మన మధ్య లేకపోయినా వారు చేసిన సేవలు మనం బ్రతికున్నంత వరకు వారు బతికినంత సమానమన్నారు. శ్యామ్ సుందర్ రెడ్డి, సిఆర్ రెడ్డి దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు గూడూరు పట్టణంలో సిఆర్ రెడ్డి ఆసుపత్రి నిర్వహిస్తున్న రోహిణమ్మ పేద ప్రజలకు ఆరోగ్యం పరంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం మనసు పూర్తిగా అభినందనలు తెలుపుతున్నామన్నారు. భారతదేశం అని రంగాల్లో ప్రపంచంలో అభివృద్ధి చెందిన పేరు ఉంది. కానీ మహిళ పట్ల లైంగిక వేదింపులు అత్యాచారాలు, బాలికలపై అఘాయిత్యాలు, ఇలాంటివి సమాజంలో అరికట్టాల్సిన అవసరం మన పై ఉందన్నారు. అదే విధంగా మహిళలకి ఉపాధి అవకాశాలు లేకపోవడం బాల్య వివాహాలు, అసమానతలు ఇవన్నీ ప్రపంచ పురోగతికి అడ్డంకులుగా మారుతున్నాయన్నారు. నేను మాజీ ఉపరాష్ట్రపతిగా పదవి విరమణ చేస్తేనే తప్ప పెదవికి కాదు అన్నారు. అందరితో మాట్లాడడం అన్ని విషయాలు తెలుసుకోవడం తెలియని వారికి నాకు తెలిసిన విషయాలు తెలియపరచడం తృప్తిగా అన్ని రకాల వంటలు తినడం అన్ని దేశాల పర్యటించడం నాకు ఎంతో ఇష్టం అన్నారు. సంపద పెంచుకో ఆ తరువాత పది మందికి పంచుకో అప్పుడే నీకు నిజమైన గుర్తింపు వస్తుందన్నారు. మనిషి ప్రజా నాయకుడిగా రాణించాలంటే జీవితంలో నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. మనిషి ఎన్ని తెలుసుకున్న ప్రపంచంలో తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయన్నారు. ప్రపంచం చాలా గొప్పది అన్నారు. అనంతరం గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ సిఆర్ రెడ్డి గూడూరుకే ఒక బ్రాండ్ అని ఆ మహానుభావుడు మహిళల కొరకు డిఆర్‌డబ్ల్యూ కళాశాలను స్థాపించి గూడూరుకు ఎంతో గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. ఆ మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. కళాశాల ఇంకా మరి ఎంతో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని వెల్లడించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గూడూరు ఎమ్మెల్యే కుమారులను ఘనంగా సన్మానించారు. అనంతరం జాతీయ గీతంతో సమావేశం ముగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిఎంకె రెడ్డి, మెహర్ మని, డాక్టర్ జనార్ధన్ రెడ్డి, డాక్టర్ రోహిణి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం

**-తిరుపతిపై అవగాహన,అనుభవంతో ప్రజలకు అందుబాటులో -తిరుపతి నూతన డిఎస్పీ వెంటకనారాయణ**



తిరుపతి,ఆగస్ట్ 9ప్రభాతవార్త: ఉన్నతాధికారుల సూచనలు...తన పై అధికారుల ఆదేశాలకనుగుణంగా తిరుపతిలో ఫ్రెండ్లీ పోలీసు సేవలు అందించేలా చూస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా నని తిరుపతి నగర నూతన డిఎస్పీ జొన్నలగడ్డ వెంకటనారాయణ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రజల సహకారం పోలీసులకు అవసరమని కోరారు. క్రిందిస్థాయి పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకోవడమేగాక అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెడతా మన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో ముఖ్యకూడళ్లలో నిరంతరం పోలీసుల బీట్‌లు కొనసాగిస్తానన్నారు. విజువల్ పోలీసింగ్ మెరుగు పరుస్తానన్నారు. తిరుపతిలో రెండు దశాబ్దాల క్రిందట పనిచేసిన అనుభవం, తిరుపతి ఆర్టీసి బస్టాండు, రైల్వేస్టేషన్, యాత్రికుల రద్దీ ప్రాంతాల్లో పోలీసింగ్ పటిష్టంపై అవగాహన ఉండటంతో మరింత మెరుగ్గా భద్రత కల్పించే చర్యలు చేపడతా నన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ మెట్టెక్కినపుడే వారికి న్యాయం జరుగుతుందని నమ్మకం కలిగించేలా పోలీసుస్టేషన్‌లలో సిబ్బంది పనితీరులో మార్పుతీసుకువస్తానన్నారు. తిరుపతి యాత్రా స్థలం, పుణ్యక్షేత్రం కావడంతో ఇక్కడ పోలీసు సేవలు విస్తృతం చేస్తానని, ముఖ్యంగా బస్టాండు పరిసరాలు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో గస్తీ మరింత పటిష్టం చేస్తానని డిఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. నూతన డిఎస్పీగా నియమితులైన జొన్నలగడ్డ వెంకటనారాయణ శుక్రవారం ఉదయం తిరుపతిలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం తిరుపతి డిఎస్పీ వెంకటనారాయణ జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,అదనపుఎస్పీలు వెంకట్రావు,కులశేఖర్,విమలకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఆదివాసీలను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుంది : ఎమ్మెల్యే

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 8 ప్రభాతవార్త : ఆదివాసిల సమస్యల పరిష్కారానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. విద్యా,ఉపాధి అవకాశాలను ఆదివాసులు అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు. ప్రపంచ ఆదివాసం దినోత్సవ వేడుకలు శుక్రవారం ఉదయం నగరంలోని గిరిజన భవన్‌లో జరిగాయి. ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆదివాసీలను అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోది, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగా, కొంత మంది బంజారా నృత్యాలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డిఆర్ఓ పెంచలకిషోర్, డిటిడబ్ల్యూఓ సూర్యనారాయణ, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి, జనసేన తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం జిల్లాఅధ్యక్షులు శివా నాయక్, పాల్గొన్నారు.

## గరుడపంచమిన... వేడుకగా మలయప్ప గరుడసేవ



తిరుమల, ఆగస్ట్ 9 ప్రభాతవార్తప్రతినిధి: గరుడపంచమి వేళ తిరుమలలో శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవతో కొండపులకించింది. సాయంత్రం నిత్యకైంకర్యాలు పూర్తి చేసుకున్న మయలప్పస్వామిని విశేష ఆభరణా లంకృతుడ్ని చేసి గరుడునిపై కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు వేదమంత్రో చ్ఛరణల నడుమ కర్పూర హారతులిచ్చారు. భక్తుల గోవిందనామస్మరణల మధ్య వాహనం కదిలి మాఢవీధుల్లో ప్రదక్షణగా బయలు దేరింది. ఈ వాహనసేవలో అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, విజిలెన్స్ వింగ్ వివిఎస్ఓ నెట్టంతులసీ వెంకటరామ్‌కుమార్ దంపతులు, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆర్చకులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా అమ్మవారి తిరుచ్చివాహనసేవ



శ్రీకాళహస్తి, ఆగస్టు 9ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్ల దీపారాధన అనంతరం అమ్మవారి ఆలయం వెలుపల ఉన్న మండపంలో ఉన్న అమ్మవారి ఉత్సవమూర్తి జ్ఞానప్రసూనాంబికాదేవిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చివాహనంపై కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకహారతులిచ్చారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# రబీ సమీపిస్తున్నా... ఆర్ఎస్‌కెలకు అందని పచ్చిరొట్ట

**- వ్యవసాయశాఖపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు**



రైతు సేవా కేంద్రం

నాయుడుపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త : రబీ కాలం సమీపిస్తున్నా ఇప్పటికీ కొన్ని మండలాల్లో పచ్చిరొట్ట విత్తనాల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. సెప్టెంబర్ నుంచి రెండోవిడత వ్యవసాయ సాగుకు సన్నద్ధం కావాల్సిన తరుణంలో నేటికీ ఆయా రైతు సేవా కేంద్రాలకు పచ్చిరొట్ట విత్తనాలు రాకపోవడంతో రైతులు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఏటా జూన్, జులై మాసాల్లోనే పచ్చిరొట్ట విత్తనాలు గతంలో అప్పటి రైతు భరోసా కేంద్రాలకు వచ్చేవి. కానీ, టిడిపి ప్రభుత్వం హయాంలో నేటికీ విత్తనాలు పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో లేకపోవడంతో అన్నదాతలు అధిక ధరలకు వెచ్చించి ప్రైవేటు డీలర్ల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి. నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో పెళ్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట మండలాలు ఉండగా, సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో 10 నుంచి 15 వరకు రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. సూళ్లూరుపేట, నాయుడుపేట రెండు సబ్ డివిజన్ల పరిధిలో సుమారు 98 రైతు సేవాకేంద్రాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నాయుడుపేట వ్యవసాయ శాఖ పరిధిలో సుమారు 4వేల క్వింటాళ్ల జీలుగలు, 500 క్వింటాళ్ల పిల్లిపెసర, 300 క్వింటాళ్ల జనుము అవసరమని అధికారికి లెక్కలు చెబుతున్నాయి. తిరుపతి జిల్లాలోని అన్ని మండలాల్లో ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ పూర్తి కాగా, కేవలం నాయుడుపేట పరిధిలో అన్ని మండలాలకు విత్తనాలు అందకపోవడం పట్ల అన్నదాతలు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికే రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం కోల్పోయిన సాగు భూములు అంతుచిక్కని తెగుళ్ల సోకి రైతులు అతలాకుతలం అవుతున్నారు. క్రమంగా వ్యవసాయ దిగుబడులు కూడా తగ్గుముఖం పడుతుండటం, సాగు ఖర్చులు పెరుగుతుండటం రైతులను కలవర పెడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు నేలను సారవంతం చేసుకునేందుకు ఎక్కువగా పచ్చిరొట్ట విత్తనాలపైనే ఆధారపడుతుంటారు. ఇటీవల కోట మండలం ఊనుగుంటపాలెంలో పర్యటించిన తిరుపతి జిల్లా వ్యవసాయాధికారి రైతులకు సకాలంలో పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయని కోట, వాకాడు ప్రాంతాల రైతులు ఆరోపిస్తున్నారు. ఆగమేఘాల మీద తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాలకులు, నాయకులు వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చి ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు జరిపారే గాని రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు సంగతి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**వ్యవసాయశాఖ ఎడి వివరణ :**

నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో విత్తనాలు కొరత వాస్తవమే అని, పైన విత్తనాలు స్టాకు లేకపోవడంతో సకాలంలో అందజేయలేకపోయామని నాయుడుపేట ఇన్‌ఛార్జ్ ఎడి సుచేంద్రప్రసాద్ తెలిపారు. ఈ నెల 15వ తేదీపైన రైతులకు విత్తనాలు అందిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

# గిరిజన సంక్షేమ పథకాలు సద్వినియోగం

**- జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య**



చిత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త: గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పిలుపునిచ్చారు. డిఆర్‌డిఏ సమావేశపు భవనంలో శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.పుల్లయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 9న నిర్వహించబడుతుందని, ఆదివాసిల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యరాజ్య సమితి ఈ దినంను 1994లో ప్రకటించడం జరిగిందన్నారు. గిరిజనుల పిల్లలు చదువుకోవడం వల్ల వారి జీవన విధానంలో మార్పు, వారి స్థితిగతులు బాగుండాలంటే ప్రతి గిరిజన కుటుంబంలోని పిల్లలను పాఠశాలకు పంపి చదివించాలన్నారు. వారు చదువుకుంటే వారి జీవితాలు అభివృద్ధి చెందుతాయని, వారే తల్లిదండ్రులను పోషించగలరని తెలిపారు. డ్వామా పిడి రాజశేఖర్ మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ వారిపై పోరాటడంలో గిరిజన పాత్ర కీలకమైనదన్నారు. గిరిజనులు సమాజానికి దూరంగా అడవులు, కొండలు, కోనల్లో వుండి అభివృద్ధికి నోచుకోకుండా జీవిస్తుంటారని, వీరు అభివృద్ధి చెందడానికి వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో వున్నాయన్నారు. గిరిజనులకు ఎదైనా సమస్య వుంటే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై అర్జీలు అందజేయాలన్నారు. అలాగే మూడు నెలలకు ఒకసారి జరిగే డివిఎంసి సమావేశంలో సైతం వీరు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. గిరిజనుల్లో చైతన్యం వచ్చి కుటుంబంలోని ప్రతి పిల్లవాడిని చదివించుకోవాలన్నారు. గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రం చిత్తూరులో గిరిజన భవన్ నిర్మాణంకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు గిరిజన వయోవృద్ధులను సన్మానిం చారు. అలాగే గిరిజన జయభేరి మాసపత్రిక 8వ సంచికను ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో డిఆర్ఓ బి.పుల్లయ్య జ్యోతి ప్రజ్వలన చేసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చివరిగా గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి పద్మనాభం, జిల్లా సాంఘీక సంక్షేమ, సాధికారిత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మీ, సమాచార శాఖ విశ్రాంత ఉద్యోగి రఘురామ్, గిరిజన సంఘ నాయకులు చిరంజీవి, కృష్ణనాయక్, మాలే గిరిధర్, మునీంద్రనాయక్, కృష్ణనాయక్, జివి రమణ, ఆదినారాయణ, సుగుణమ్మ, డివిఎంసి సభ్యులు దేవరాజులు, రాజ్‌కుమార్, బాబు, మునస్వామి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది, గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై...
# రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు కొరడా

**-అక్రమ రవాణా చేస్తున్న వారి గుండెల్లో రైళ్లు**



రైల్వే స్టేషన్‌లో రైల్వే జోన్ పోలీస్ అధికారులు

రేణిగుంట, ఆగస్టు 9 ప్రభాతవార్త : మానవ అక్రమ రవాణా చేస్తున్న దుండగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు శుక్ర వారం కట్టుదిట్ట మైన భద్రత చర్యల్లో భాగంగా ప్రత్యేక వాహనాన్ని, ప్రొటెక్షన్ ఫోర్స్ సౌకర్యార్ధం రెస్ట్ హౌస్‌ను ప్రారంభించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమాసింగ్ ఠాగూర్, సదరన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఈశ్వర రావు ప్రత్యేకించి తిరుపతి రైల్వే స్టేషన్‌ను సందర్శించి గెస్ట్ హౌస్‌తో పాటు, ప్రత్యేక సంచార వాహనాన్ని ప్రారంభించారు. ప్రత్యేక సంచార వాహనం ద్వారా మానవ రవాణా చేస్తున్న దుండగుల ఆట కట్టించేందుకు మార్గం సులభతరం అయింది. భారత రైల్వే ప్రతిష్టాత్మ కంగా ప్రారంభించి మేరీ సహేలి, చైల్డ్ లైన్, వన్ స్టాప్ సెంటర్ అధికారు లు, సిబ్బంది ఇరుజోన్ల ఐజీలు అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి, జిఆర్‌పిడిఎస్పి హర్షిత, ఆర్పిఎఫ్ సిఐ మధుసూధన్ లు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డి భూ దందాపై న్యాయ విచారణ జరపాలి

**-సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ**

తిరుపతిరూరల్, ఆగష్టు9 ప్రభాతవార్త: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూదందాలపై న్యాయ విచారణ జరపాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేసారు. మాజీ సి.యం. జగన్మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నారని నారాయణ ఆరోపించారు. శుక్రవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్యభవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా భూదందాలకు పాల్పడ్డారని, ఆయన ద్వారా భూములు కోల్పోయిన భూ బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. జ్యుడిషియల్ విచారణ జరిపితే పెద్దిరెడ్డి కుటుంబం చేసిన భూ కుంభకోణాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి రూ.15వేల కోట్ల రుపాయాలు ఋణంగా ఇస్తుందని, ప్రత్యేక హోదా ఇవ్వాలని ముఖ్యమంత్రి డిమాండ్‌ను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేస్తే సరిపోదని, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్రవర్గ సభ్యులు హరినాధరెడ్డి, రామానాయుడు, విశ్వనాథ్, చిన్నం పెంచలయ్య, రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీ-నీవా కాలువల పనులకు...
# 166 కోట్లతో ప్రతిపాదనలు

**-కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు 49 కోట్లు -పుంగనూరు కాలువల మరమ్మతులకు 117 కోట్లు**



హంద్రీ-నీవా కాలువ ఫైల్‌ఫోటో

కుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త : పడమటి నియోజకవర్గాల రైతులు, ప్రజలకు నీటి కష్టాలు తీర్చేందుకు ముఖ్య జలాధారంగా మారిన కృష్ణానది జలాలు పూర్తిస్థాయిలో ఈ ప్రాంతాలకు అందేలా ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నతాధికారులు సన్నద్ధం అవుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పడమటి ప్రాంతాలైన మదనపల్లి, పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రజలు, రైతుల సౌకర్యార్థం 2014-19మధ్య హంద్రీ-నీవా కాలువల నిర్మాణాలు చేపట్టి శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా తరలించాలని నిర్ణయించారు. ఆ సమయంలోనే వందల కోట్ల రూపాయలతో పనులు శరవేగంగా సాగాయి. పుంగనూరు నుంచి కుప్పం నియోజకవర్గానికి హంద్రీ-నీవా జలాలు తరలించేందుకు 2015లో సుమారు 463 కోట్ల అంచనా వ్యయంతో కుప్పం బ్రాంచ్ కెనాల్ కాలువ పనులు ప్రారంభిం చారు. పెద్దపంజాణి మండలం అప్పినపల్లి నుంచి కుప్పం మండలం పరమసముద్రం చివరి పాయింట్ దాకా సుమారు 143 కిలోమీటర్ల మేర ఈ కుప్పం బ్రాంచ్ కెనాల్ కాలువ పనులు ప్రారంభించారు. 2019 జనవరిలో సైతం కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు త్వరగా పూర్తయ్యేలా అప్పట్లో ప్రభుత్వం మరో వంద కోట్ల నిధులు సైతం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదు. దాదాపు 83శాతం మేర పనులు అప్పట్లోనే పూర్తయ్యాయి. వి.కోట వరకు అప్పట్లో కృష్ణాజలాలను తీసుకువచ్చి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే అప్పట్లో ప్రారంభించారు. నీటి తరలింపుకు గుడు పల్లె మండలం గుడివంక, శాంతిపురం మండలం బండపల్లి మధ్య భారీ సొరంగాన్ని సైతం తవ్వారు. అయితే 2019లో ప్రభుత్వం మారాక హంద్రీ-నీవా కాలువల పనులు అటకె క్కాయి. పనుల పూర్తికి కాంట్రాక్టర్లకు నోటీసులు ఇస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. దీంతో పనులు ఏ మాత్రం ముందుకు సాగలేదు.

**జగన్ హడావుడి.. జనంలో అభాసుపాలు :**

2024 ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో మాజీ సిఎం జగన్ ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో హడావుడి చేశారు. కుప్పానికి హంద్రీ-నీవా జలాలు ఇస్తున్నామంటూ రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. మరుసటి రోజుకే అదే రాజుపేట వద్దగల కాలువలో నీరు అడుగంటిపోవడం జరిగింది. దీంతో హడావుడి చేసిన జగన్ జనంలో అభాసుపాలయ్యారు. పనులు పూర్తికాకనే జగన్ కుప్పంలో ఎన్నికల స్టంట్ చేశారని సిఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తాము మరలా అధికారంలో రాగానే చివరి పాయింట్ పరమసముద్రం దాకా కృష్ణాజలాలు తీసుకువస్తామని చంద్రబాబు అప్పట్లోనే ప్రకటించారు. స్వయానా జగన్ ప్రారంభించిన కాలువలను పరిశీలించి వాస్తవాలు ప్రజలకు వివరించారు.

**166కోట్లతో ప్రతిపాదనలు :**

పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ కాలువల నిర్మాణాల పూర్తికి హంద్రీ-నీవా ఉన్నతాధికారులు 166 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పుంగనూరు కాలువ వెడల్పుకు గతంలోనే 1217కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రస్తుతం కుప్పం బ్రాంచ్ కెనాల్ వరకు నీరు అందించేందుకు గాను పుంగనూరు కాలువ మరమ్మతులు, కొంతమేర కాలువల వెడల్పు చేసేందుకు 117కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ రాజగోపాల్ 'ప్రభాతవార్త'కు తెలిపారు. అలాగే 83శాతం ఇదివరకే పూర్తయిన కుప్పం బ్రాంచ్ కెనాల్ (కెబిసి) పనులను కుప్పం మున్సిపాలిటీలోని చివరి పాయింట్ పరమసముద్రం చెరువు వరకు తరలించేందుకు సుమారు 49 కోట్లతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఎస్ఇ తెలిపారు. ఏది ఏమైనా వచ్చే ఏడాది కల్లా కుప్పం,పుంగనూరు కాలువల్లో కృష్ణాజలాలు పరవళ్లు తొక్కడం ఖాయంగా కన్పిస్తోంది.

## పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం స్థలాల పరిశీలన



కుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త : కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని వడ్డిపల్లి గ్రామంలో అర్హులైన లబ్దిదారులకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు గాను శుక్రవారం మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో స్థలాలు గుర్తించి హౌసింగ్ పథకానికి ప్రతిపాదనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ రవి, యూనిట్ ఇన్‌చార్జ్ మాణిక్యం, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## నూతన ఆర్టీసీ సర్వీసు ప్రారంభం



కుప్పంరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త : మండలంలోని దేవరాజపురం గ్రామానికి కుప్పం నుంచి నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును తెదెపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్ర బాబు నాయుడు ఆదేశాలతో సరిహద్దుల్లోగల దేవరాజపురం గ్రామ ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సును ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ పతాకావిష్కరణ చేశారు. ప్రజలనుంచి సమస్యలు అడిగి తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, కన్నన్, చెక్కునత్తం మణి, సంతోష్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## బిందుసేద్యం కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

శాంతిపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త : మండలంలో భూములు కలిగిన రైతులు సూక్ష్మనీటి పథకంలో లబ్ది పొందేందుకు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు కోరారు. 1బి అడంగల్, పాసుపుస్తక, రైతు ఆధార్, మొబైల్, బ్యాంకు పాసుపుస్తకంనకళ్లు, రైతు ఫోటో, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లు నకళ్లు అందజేయాల్సి ఉంటుందన్నారు. 5 ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణం గల రైతులకు తొంభై శాతం రాయితీ, 5–10 ఎకరాలవరకు గల రైతులకు డెబ్భైశాతం రాయితీ, స్ప్రింక్లర్ల కోసం యాభై శాతం రాయితీ అందించడం జరుగుతుం దన్నారు. రైతులుశ్రీసద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్రీడాసామగ్రి కోసం ఆర్థికసాయం



శాంతిపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త : మండలంలోని తుమ్మిశి జడ్పీహైస్కూల్‌ను శుక్రవారం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రీడా సామగ్రి కొనుగోలుకు ఆర్థికసాయాన్ని అందజేశారు.నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, కన్నన్, జనార్ధనరెడ్డి, మణి, సంతోష్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## 14న కుప్పం మండల మీట్

కుప్పంరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త : కుప్పం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 14వతేదీ మండల కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ ఖాదర్ బాషా తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త : కుప్పం మండలంలోని 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు_ల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రెస్కో ఎండి సోమశేఖర్ తెలిపారు. ఉదయం 7గంటలనుంచి 10గంటల దాకా కుప్పం మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సర్కిల్ ఇన్స్‌పెక్టర్ల బదిలీలు

చిత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త: అనంతపురం రేంజ్ పరిధిలో పలువురు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డిఐజి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ పి.శేషగిరిని తిరుమల క్రైం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అలాగే చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఐ.రవిశంకర్‌రెడ్డిని చిత్తూరు విఆర్‌కు బదిలీ చేశారు. అలాగే వి.కోట అర్బన్ పిఎస్ ఇన్స్‌పెక్టర్ లింగప్పను చిత్తూరు విఆర్‌కు బదిలీ చేశారు. అలాగే కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యబాబును చిత్తూరు విఆర్‌కు బదిలీ చేశారు. పుంగనూరు రూరల్(చౌడేపల్లి) సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం.కృష్ణారెడ్డిని చిత్తూరు ఎస్పీ విఆర్‌కు బదిలీ చేశారు. అలాగే నగరి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఇన్స్‌పెక్టర్ సురేష్‌ను చిత్తూరు విఆర్‌కు బదిలీ చేశారు. అలాగే నగరి ఇన్స్‌పెక్టర్‌గా తిరుపతి పిటిసిలో విధులు నిర్వహిస్తున్న ఎం.మహేశ్వర్, పుంగనూరు రూరల్(చౌడేపల్లి) ఇన్స్‌పెక్టర్‌గా కడప క్రైం పోలీస్ స్టేషన్–2లో విధులు నిర్వహిస్తున్న ఎం.రాంభూపాల్, కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా కర్నూలు జిల్లాలో ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.హనుమంతప్పలు బదిలీ అయ్యారు. అలాగే వి.కోట అర్బన్ ఇన్స్‌పెక్టర్‌గా కర్నూలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఇన్స్‌పెక్టర్ ఆర్.సోమశేఖర్‌రెడ్డి, గంగవరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా అన్నమయ్య జిల్లాలో ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బొద్దు ప్రసాద్, చిత్తూరు టుటౌన్ ఇన్స్‌పెక్టర్‌గా తిరుపతి పిటిసిలో విధులు నిర్వహిస్తున్న డి,నెట్టికంఠయ్య, చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గాకడపసైబర్‌క్రైమ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.శ్రీధర్‌నాయుడులు బదిలీ అయ్యారు.

## డీఎంఅండ్‌హెచ్‌ఓచే కాణిపాకం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



కాణిపాకం, ఆగస్టు 9 ప్రభాతవార్త: కాణిపాకం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె పీహెచ్‌సీలో సిబ్బంది హాజరుపట్టి, రికార్డులను పరిశీలించారు. అలాగే ఆరోగ్యకేంద్రంలో పీఎంఎస్‌వైను సందర్శించి గర్భ వతులకు తగు సూచనలు చేశారు. ప్రతి గర్భవతి పౌష్టికాహారం తీసుకోవాలని, పీహెచ్‌సీలలోనే డెలివరిలను చేసుకోవాలని ప్రభావతి సూచించారు. అనంతరం తిరువణంపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సింధూర, డాక్టర్ రాజేశ్వరి, మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, పీహెచ్ఎన్ వేదవతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన జిల్లా కలెక్టర్,ఎస్పీ



సత్యవేడు,ఆగష్టు9 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ శుక్రువారం శ్రీసిటీని సందర్శించారు. మొదటిసారి సందర్శనకు వచ్చిన జిల్లా అధికారులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈసందర్భంగా పారిశ్రామిక వాడ ప్రగతి, ప్రత్యేకతలను వారికి వివరించారు. ఈప్రాంతంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, శాంతి భద్రతల అంశాలను అధికారులతో చర్చించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలతో పాటు డైకిన్ పరిశ్రమను అధికారులు సందర్శించారు. జిల్లా అధికారుల వెంట స్థానిక పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే విద్యాసామాగ్రి పంపిణీ

సత్యవేడు,ఆగష్టు9 ప్రభాతవార్త: గత ప్రభుత్వం హయాంలో భ్రష్టుపట్టిన విద్యాశాఖను ప్రక్షాళన చేసి నూతనోత్తేజంతో నింపేందుకు అడుగులు వేగవంత మయ్యాయని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శుక్రువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి, అధ్యాపకుల నియామకం వంటి ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## నూతన ఒరవడిని సృష్టించడంలో 'విజయం' ముందజ

### – పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే డా.మురళీమోహన్




చిత్తూరురూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త: విద్యారంగంలో నూతన ఒరవడిని సృష్టించడంలో విజయం విద్యాసంస్థ ఎప్పుడూ ముందంజలో వుంటుందని పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే డా.మురళీమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం విజయం విద్యాసంస్థల ఆద్వర్యంలో కొత్తగా స్థాపించిన విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు ఓరియంటేషన్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఎస్వీ యూనివర్శిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ డా.తేజోమూర్తి ఆద్వర్యంలో నడుస్తున్న ఇతర విద్యాసంస్థల కంటే విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరింత ఆధునీకరణలతో ప్రారంభిస్తున్నారనీ, విజయం ప్రయాణం ఇంతటితో ఆగకుండా డీమ్డ్ యూనివర్శిటీ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యాసంస్థల అధినేత డా.తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ డా.శైలజ మూర్తిలు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యను దశదశలుగా విద్యార్థులకు అందించాలనే ధ్యేయంతో విజయం ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించామని, ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ఎక్కువ మంది అడ్మిషన్లు పొందారనీ వారి నమ్మకానికి తగినట్లుగానే విద్యాప్రమాణాలు వుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులు అడవితల్లి ముద్దుబిడ్డలు

### – తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త : గిరిజనులు అడవితల్లి ముద్దుబిడ్డలు అని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్జీఓ హోంలో ఆలిండియా బంజారా సేవా సంఘం, యానాది,ఎరుకుల సేవా సంఘం అధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు మందులు కనుగొన్న డాక్టర్లు అని కొనియాడారు. ప్రకృతిని ఇల్లుగా చేసుకుని కొండ కోనలతో ఎనలేని అనుబంధాలను కలిగి ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎబిబిఎస్ఎస్ అధ్యక్షుడు రవినాయక్, శివాజీనాయక్, కామరాజునాయక్, చంద్రబాబునాయక్, గౌడ నాయక్, కుమార్‌నాయక్, మున్న, చలపతి, రాగు, రామచంద్ర, రెడ్డినాయక్, ఎరుకుల యానాది సంఘ అధ్యక్షుడు కృష్ణప్ప, నాగభూషణం, నారాయణ, గా ంధీ, రాజేంద్ర, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, శాంతారాం, కన్నన్, మణి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## తల్లిపాలే ముద్దు బుడ్డిపాలు వద్దు



గంగాధర నెల్లూరు ఆగష్టు 9 ప్రభాతవార్త: తల్లిపాలే ముద్దు బుడ్డిపాలు వద్దు అని అవార్డు సంస్థ డైరెక్టర్ రవి అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని కొండే పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో తల్లి పాల వారోత్స వాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లి పాలలో అత్యధక ప్రోటీన్లు ఉంటాయని పిల్లలు పెరుగుదల శారీరక దారుఢ్యాన్ని ఇచ్చే శక్తి ఉందనే అన్నారు.ఉపాధ్యాయురాలు శైలజ అంగన్‌వ్వాడి టీచర్ భానుమతి మహిళ పోలీస్ స్రవంతి పలువురు బాలింతలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగపంచమి



చౌడేపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త : స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నాగపంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు ఆలయ ప్రాంగణంలోని నాగుదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రాజశేకర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో నాగదేవతలకు విశేషాభిషేకం, అలంకరణ గావించారు.

## స్మశానవాటికకు స్థలాన్ని చూపండి

### –నాయనివారిపాళెం వాసుల వేడుకోలు



చౌడేపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త : స్మశానవాటికకు స్థలం చూపాలని తహశీల్దార్ హనుంతునాయక్‌ను బత్తలాపురంరోడ్డు వాసులు కోరారు. ప్రాంతంలో 70దాసరి కుటుంబాలున్నాయనీ, అయితే స్మశాన వాటిక లేక చెరువులను ఆశ్రయించాల్సి వస్తోందని నరసింహులుదాసు తహశీల్దార్‌తో మొరపెట్టుకొన్నారు. వర్షాకాలం వస్తే ఇబ్బందిగా వుందనీ, పలుమార్లు రెవిన్యూ అధికారులకు తెలిపినా పట్టించు కోలేదన్నారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రాన్నందించారు. పరిశీలించి స్థలం చూపిస్తామని తహశీల్దార్ వారికి హామీ ఇచ్చారు. సుబ్రమణ్యం, పెద్దరెడ్డెప్ప, శ్రీనివాసులు, రమణ, శివాజీ, రెడ్డెప్ప రెడ్డిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్



కాణిపాకం, ఆగస్టు 9 ప్రభాతవార్త: రాష్ట్ర చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జయలక్ష్మీ శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయం వెలుపల జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి,ఐరాల తహశీల్దార్ మహేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధుని దర్శించుకున్న దీపా వెంకట్



కాణిపాకం, ఆగస్టు 9 ప్రభాతవార్త: మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్యనాయుడు కుమార్తె స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్మన్ దీపా వెంకట్ శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వా మివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ ఏఈఓ విద్యాసా గర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆవె వెంటఆలయ సూపరెండెంట్ కోదండపాణి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కెనరా బ్యాంకు ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం

చిట్టమూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త :



వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు తమ బ్యాంకు నిరుపేద విద్యార్థులకు అండగా ఉంటుందని చిట్టమూరు కెనరా బ్యాంకు మేనేజర్ జడపల్లి రవిరాజా చెప్పారు. శుక్రవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ కెనరా బ్యాంకు ఆవిర్భావం నుంచి గత ఐదేళ్లుగా ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన పేదలైన మెరిట్ విద్యార్థులను గుర్తించి వారికి ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి చిట్టమూరు మండల కేంద్రంలోని గణపర్తి మార్కండేయులు నాయుడు జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదివే ఆరుగురు విద్యార్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేశామన్నారు. వీరికి ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్థిక సహాయం అందజేసేందుకు కార్యక్రమానికి శ్రీకారంచుట్టామన్నారు. కెనరా బ్యాంకు తిరుపతి ఆర్ఓ పరిధిలో వినియోగదారులకు సేవలు అందించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సూళ్లూరుపేట సీఐగా మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త :



సూళ్లూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయన సూళ్లూరుపేట సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సిఐగా ఉన్న మధుబాబు బదిలీపై వెళ్లారు. పోలీసు సర్కిల్ కార్యాలయానికి వచ్చిన ఆయనకు సిఐ మధుబాబు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన సిఐ మురళీకృష్ణ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. పబ్లిక్‌గా మద్యం సేవించే వారిపై, గంజాయి విక్రేతలు, గంజాయి సేవించే వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

## తహశీల్దార్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరణ

గూడూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త :



గూడూరు తహశీల్దార్‌గా ఎస్. చంద్రశేఖర్ శుక్రవారం గూడూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయంలోని ఎలక్షన్ విభాగంలో పనిచేశారు. ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా గూడూరుకి వచ్చారు. ఈయన గతంలో సైదాపురం, చిట్టమూరు మండలాల్లో తహశీల్దార్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

## కార్పొరేట్ కంపెనీల దోపిడీని అరికట్టాలి

వెంకటగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త




ఆగస్టు 9 క్విట్ ఇండియా డే సందర్భంగా క్విట్ కార్పొరేట్స్ పేరుతో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్ర మాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం నాడు పట్టణ వీధుల్లో రైతు కూలీ సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు, కార్మికులతో పాటు అన్ని సెక్షన్ల ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలకు కారణం మోడి అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలేనని విమర్శించారు. అదానీ, అంబానీలు మోడీని ఉపయోగించుకొని ఈ పదేళ్లలో ప్రపంచ కుబేర్ల జాబితాలోకి చేరారని అన్నారు. సంపన్నుల దగ్గర సంపద పోగు పడగా పేదలు దారిద్రంలోని నెట్టబడ్డారని తెలియజేశారు. వ్యవసాయ యంత్ర పరికరాల పై జిఎస్టి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ , సిపిఎం నాయకులు బాలకృష్ణయ్య, వడ్డిపల్లి చెంగయ్య, శివకుమార్, ఏఐవైఎఫ్ నాయకులు జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 13న హైదరాబాద్‌కు మాదిగలు తరలిరావాలి

వెంకటగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త :



ఈ నెల 13వ తేదీ ఢిల్లీ నుండి హైదరాబాద్‌కు ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిక వస్తున్న సందర్భంగా స్వాగతం పలికేందుకు మాదిగల అందరూ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి పల్లిపాడు రవి మాదిగ తెలిపారు. చిలకమ్మాడు గ్రామంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి టౌన్ అధ్యక్షుడు కంటిపల్లి మనీ మాదిగ, గ్రామ నాయకులు పులిరత్నయ్య, చిగురుపాటి గోపాలు, కొమ్మల రామయ్య, కంటిపుల్లి సోమయ్య, పులి భాస్కరు తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులు సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

బాలాయపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త :

మండలంలోని సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12వ తేది నఉండి 14వ తేది వరకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఓ అరుణ తెలిపారు. రిప్రషన్ కోర్స్‌పై మూడు రోజులు శిక్షణ ఉంటుందని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నిర్వహించే ఈ శిక్షణకు వచ్చే వారికి భజన వినతి కూడా కల్పించినట్లు తెలిపారు. తప్పక శిక్షణకు హాజరు కావాలని ఆమె కోరారు.

## కోటలో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

కోట, ఆగస్టు 9 ప్రభాతవార్త :



కోటలోని శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో శుక్రవారం ప్రముఖ సినీనటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మీజూరు చంద్ర దాతృత్వంతో మహేష్‌బాబు అభిమానులు వేడుకలు నిర్వహించారు. ముందుగా కేకు కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కోట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దిన్ మాట్లాడుతూ ఘట్టమనేని వారసుడిగా మహేష్‌బాబు చలనచిత్ర రంగంలో తొలిసారిగా 'రాజకుమారుడు' సినిమాతో ఆరంగేట్రం చేసి టక్కరిదొంగ, సర్కారువారిపాట, మహర్షి, గుంటూరుకారం, పోకిరి వంటి ఎన్నో చిత్రాలు తీసి ప్రేక్షకుల మనసును దోచుకున్నారని చెప్పారు. మహేష్‌బాబు నటించిన చిత్రాలకు గాను 9 నంది అవార్డులు, 5 ఫిలింఫేర్ అవార్డులు దక్కించుకున్నారని చెప్పారు. అంతేకాకుండా ప్రకృతివిపత్తు సమయాల్లో పెద్దమనసుతో బాధితులను ఆదుకోవడం ఘట్టమనేని కుటుంబానికే చెల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మీజూరు చంద్ర, బషీర్, నాయబ్, సునీల్, సాయి, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగులపంచమి వేడుకలు

కోట, ఆగస్టు 9 ప్రభాతవార్త :



కోట మండలంలోని విద్యానగర్, చిట్టేడు, కేశవరం, గూడలి, నెల్లూరుపల్లి కొత్తపాలెం, వెంకన్నపాలెం, తిన్నెలపూడి, జరుగుమల్లి, కర్లపూడి, కొత్తపట్నం తదితర గ్రామాల్లో శుక్రవారం భక్తులు నాగులపంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని పాముల పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి నైవేద్యంగా సమర్పించారు. ఉపవాస దీక్షలు ఆచరించిన మహిళలు పాముల పుట్ట వద్ద మొక్కలు చెల్లించారు. అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని నాగదేవతను వేడుకున్నారు.

## కెవికెల ద్వారా రైతులకు సేవా కార్యక్రమాలు

వెంకటగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త :



50 సంవత్సరాల నుండి కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు విరివిగా సేవా కార్యక్రమాలు అందిస్తున్నాట్లు డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు కరుణశ్రీ తెలిపారు. వెంకటగిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆమె మాట్లాడుతూ 1974 మార్చి 21న కెవికెలు పాండిచ్చేరిలో స్థాపించినట్లు తెలిపారు. సాంకేతిక రంగంలో రైతులను మమేకం చేస్తున్నట్లు చెప్పారు. నాబార్డ్ ద్వారా స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నా అబార్డు ఏజీఎం పి. సునీల్, మెప్మా డైరెక్టర్ రాధమ్మ, ఎల్‌డిఎం జి. కృష్ణ, ఎస్బిఐ మేనేజర్ మల్లికా బ్రమరాంబ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఉమాపతి, సిడిపిఓ శంషాద్ బేగం, కెవికె శాస్త్రవేత్తలు విజయశ్రీ తిరుపాలు, నాగార్జుర రెడ్డి, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం



చిత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త: పురిటి నొప్పులు అధికం కావడంతో చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్ళాలని 108 వాహనంలో బయలుదేరిన ఓ నిండు గర్భవతికి పురిటి నొప్పులు అధికం కావడంతో 108 వాహనంలోనే ప్రసవించిన సంఘటన చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాళ్యంలో జరిగింది. తుమ్మిందపాళెం గ్రామంలో ప్రియ(19), రవి(22)లు దంపతులు. ప్రియకు రెండవ కాన్పు కోసం గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో సుఖ ప్రసవం కోసం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్ళాలని 108 వాహనంకు ఫోన్ చేశారు. ఈ మేరకు హుటాహుటిన అక్కడికి చేరుకున్న 108 వాహనం గర్భవతి ప్రియను వాహనంలో ఎక్కించుకుని చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్తుండగా మార్గమధ్యలో ఉయ్యాలచింత వద్ద ప్రియకు పురిటి నొప్పులు అధికం అయ్యాయి. ఉయ్యాలచింత వద్ద 108 వాహనంను నిలుపుదల చేసి సిబ్బంది శివకుమార్, మగేష్‌లు పురుటి నొప్పులకు సంబంధించిన చికిత్సను ప్రియకు అందించారు. నిండు గర్భిణి ప్రియ 108 వాహనంలోనే పండంటి మగబిడ్డకు అర్ధరాత్రి 12.20 గంటలకు జన్మనిచ్చింది. అనంతరం 108 వాహనంలో ప్రియ, ఆమె బంధువులను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స అందించారు.

## రైతుకు ప్రకృతి ఎరువులు

పాలసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త:



రైతులకు మంచి పంట దిగుబడి కోసం ప్రకృతి ఎరువులు తయారు చేసి అందించాలని ఎంపిడిఓ రామనాథరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీకావేరిరాజపురం సంపద తయారీ కేంద్రం ఆవరణలో శుక్రవారం ఎంపిడిఓ రామనాథరెడ్డి, పంచాయతీరాజ్ కార్యాచరణ ట్రైనర్ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన రెండవ రోజు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఓ మాట్లాడుతూ సంపద కేంద్రాల్లోకి తీసుకువచ్చిన నిరర్థక పదర్థాలతో ప్రకృతి వ్యవసాయం చేసి రైతులకు అందించాలన్నారు. రైతులు ఈ ఎరువులను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయం చేసి నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించవచ్చునన్నారు.

**ఆడవి పందుల నుండి పంట రక్షణకు రైతులకు అవగాహన:**

ఆడవి పందుల నుండి పంటను రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన సమగ్ర భూ యాజమాన్య పద్ధతులపై శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంరక్షకులు టివి నాగపద్మిని రైతులకు అవగాహన కల్పించారు. శ్రీకావేరి రాజపురం రైతు భరోసా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అడవి పందులు ఎక్కువగా వున్న పొలాల వద్ద టపకాయలు, పటాకులు, కేకలు, ఖాళీ డబ్బాలతో శబ్దాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్గో సర్వీస్ ప్రారంభం

పాలసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం బలిజకండ్రిగ బస్‌స్టాప్ నుండి శుక్రవారం ఆర్టీసీ అధికారులు కార్గో సర్వీస్‌ను ప్రారంభించారు. చిత్తూరు ఆర్టీసీ టు డిపో డిఎంఇ కుమార్ కార్గో సర్వీసు ప్రారంభించి మాట్లాడుతూ ఇక్కడి నుండి ప్రజలు ఎవరైనా ఎద్దైనా వస్తువును నిర్ణీత ధర చెల్లించి ఎక్కడికైనా పార్శిల్ సర్వీసు చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## పక్కాగా శాంతిభద్రతల పరిరక్షణ

### – ఎన్ఆర్ పేట పోలీసి స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త: పక్కాగా శాంతిభద్రతల పరిరక్షణ చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. చిత్తూరు ఈస్ట్ సర్కిల్ పరిధిలోని ఎన్ఆర్ పేట పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మణికంఠ చందోలు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో పోలీసుల పనితీరు, పోలీస్ స్టేషన్ నిర్వహణ, ముఖ్య కేసుల దర్యాప్తు, స్టేషన్ నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్ తదితరాలను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిసరాల్లో వున్న వాహనాలను త్వరగా వేలం వేయాలన్నారు. రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, ఎన్ఆర్ పేట ఎస్ఐ సుబ్బమ్మ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వయనాడు మృతులు ఐదు వేల మంది : చింతామోహన్

**తిరుపతి హెల్త్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** ప్రకృతి విలయ తాండవ వరద బీభత్స్య ప్రకోపానికి వాయినాడు మృతులు ప్రభుత్వం ప్రకటించినట్లు 500 మంది కాదని దాదాపు ఐదు వేల మంది వరకు ఉంటారని మాజీ కాంగ్రెస్ మంత్రి చింతా మోహన్ వెల్లడించారు.



తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియా ముందు కాంగ్రెస్ నేతలు ఎర్లపల్లి గోపి, సావిత్రమ్మ తదితరులతో కలిసి చింతా మోహన్ మాట్లాడుతూ సుప్రీం కోర్టులో 34 మంది జడ్జిలు ఉన్నారని, వారి వారసులే నేటికి కొనసాగుతున్నారని ఆరోపించారు. ఎల్లకాలం వారసులే సిఎం కావాలా అని ప్రశ్నించారు. సిఎం అంటే బుద్ధదేవ్ బట్టాచార్య అని కొనియాడారు. భట్టాచార్య నేడు మృతి చెందారన్నారు. అతను బతికున్న రోజుల్లో ఇంట్లో ఏసీ కూడా లేకుండా సామాన్యుడిగా బీడి తాగుతూ జీవించాడన్నారు. కుక్కలకు కూడా ఏసీలు పెట్టించే ఈ రోజుల్లో ఇంట్లో ఏసి కూడా లేని సాధారణ జీవితం గడిపిన ఏకైక సిఎం బుద్ధదేవ్ అంటూ కొనియాడారు.

## సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడి హేయమైన చర్య



**-పచ్చమూకల దాడిని ఖండించిన మోహిత్‌రెడ్డి**

**తిరుపతిరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడిని తుడ మాజీ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూకలు దాడి హేయమైన చర్యగా పేర్కొన్నారు. విజయవాడలో సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడిని నిరసిస్తూ శుక్రవారం తిరుపతిరూరల్ పేరూరు పంచాయతీలో వున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు.ఈ కార్యక్రమంలో మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విజయవాడలో మహాశిల్పంపై దాడి జరగడం, పోలీసులకు సకాలంలో సమాచారం ఇచ్చిన పోలీసులు స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెంచుమోహన్ యాదవ్, పరంధామరెడ్డి, ప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు 6వేల డజన్ల గాజులు, 12వేల కంకణాలు

**-పద్మావతీ అమ్మవారికి అందజేసిన సివిల్ ఇంజనీరు దంపతులు**

**తిరుపతిరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని 6వేల డజన్ల గాజులు, 12వేల కంకణాలు, పసుపు, కుంకుమ ప్యాకెట్స్‌ను సివిల్ ఇంజనీరు దంపతులు అందజేసారు. ప్రతి ఏటా అమ్మవారి ఆలయంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి భక్తులకు గాసులు, కంకణాలు, పసుపు కుంకుమ అందజేస్తున్నట్లు సివిల్ ఇంజనీర్ దంపతులు బుసా షర్మిల షణ్ముగం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ షగిరిరావు, వాహన ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్, ఆలయ ప్రధాన అర్చకులు బాబుస్వామి పాల్గొన్నారు.



## శివయ్య సేవలో ఠాకూర్ పూజలు



**శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త :** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శుక్రవారం సెంట్రల్‌రైల్వే ఐజి ఆరోమసింగ్ ఠాకూర్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం కాబట్టి పలు రైళ్ళను ఆపాలని అభ్యర్ధించారు. ఆలయ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, ఆలయ పిఆర్‌ఓ రవి వారి సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మాతమ్మ ఉత్సవాలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి పట్టణంలోని సున్నపు దళితవాడలో వెలసిన మాతమ్మ ఆలయంలో వార్షికోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తూర్పు మండలాల్లో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరిస్తున్నాయి. ఈ ఉత్సవాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆయనకు ఆలయ కమిటి సభ్యులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొన్న ఆయనకు కమిటి వారు అమ్మవారి తీర్ధ ప్రసాదాలను అందించారు.కమిటి సభ్యులు ధవల గిరి,మునివెంకటేష్, మనోజ్ భక్తులు కమిటి సభ్యులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి అల్లాహ్‌ను శరణ కోరటమే



**శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త :** సమాజంలోనూ, ప్రతి ఇంటిలోనూ చోటు చేసుకుంటున్న సమస్యల పరిష్కారానికి అల్లాహ్‌ను శరణుజొచ్చి వేడుకోవటమే శరణ్యమని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్ధనల అనంతరం ఆయన బోధన చేస్తూ నేడు సమాజంలో ఎటు చూసినా ఏ వర్గంలో చూసినా,ఏ వ్యాపారస్తునిలో చూసినా సమస్యలతో సతమతమౌతున్నారని అయితే సమస్యలకు మూలం ఏమిటో మనం ఎటు వెళుతున్నామో గుర్తించలేక పోతున్నామని వివరించారు.సమస్యల పరిష్కారానికి మనం అల్లాహ్‌ను శరణుజొచ్చి వేడుకోవటమే మార్గమన్నారు. రోజులో మనం కనీసం పది నిముషాలు మనల్ని పుట్టించిన అల్లాహ్‌ను స్మరించలేకపోతున్నామన్నారు. మనలో మార్పు రావాలని రేహాన్ పిలుపు నిచ్చారు. అన్ని సమస్యలకు పరిష్కారం అల్లాహ్ ప్రార్ధనే అని గుర్తించాలన్నారు.

## 15 నుంచి నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 9 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి.ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌వియస్‌ఎన్ మూర్తి సూచనలతో ఏర్పాట్లును చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పర్యవేక్షిస్తున్నారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి స్వగ్రామంలో ఆయన శాసనసభ్యుడుగా గెలిచిన తరువాత జరుగుతున్న మొదటి బ్రహ్మోత్సవాలు కాబట్టి ఏర్పాట్లును చేపట్టారు. ఆలయానికి అనుబంధంగా గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా హాజరౌతారు కాబట్టి ఏర్పాట్లు చేపట్టారు.

## పరిమళించిన మానవత్వం!

**శ్రీకాళహస్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త :** ఆయన శ్రీకాళహస్తి పట్టణం భరద్వాజ సమీపంలో ఉన్న సాధుస్వయంభువు స్వామి ఆశ్రమంలో కృష్ణస్వామి గత 13 సంవత్సరాలుగా తమిళనాడు నుంచి వచ్చి వంటమాస్టర్‌గా విధులు నిర్వహిస్తుం టాడు. గత కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యానికి గురికావడంతో మంచడం పట్టాడు. దీంతో విషయం తెలుసుకున్న సాధుస్వయంభువుస్వామి ఆశ్రమసేవకులు వంకాయల సిద్దులయ్యకు స్వామి సమాచారం అందించడంతో ఆయనుకు స్నానం చేయించి శుభ్రంగా సేవకుడిగా చేసి కొత్తదుస్తులు అందించి తిరిగి ఆస్పత్రిలో చేర్పించడంతో మరో మూడు రోజుల పాటు ఉంచి వైద్యం అందించాలని సూచించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈనేపధ్యంలో సేవకుడు సిద్దులయ్యను అభినందించారు. ఇలాంటి యువతనుస్ఫూర్తిగా తీసుకుని వృద్దులను ఆదరించి సేవలందించాలని కోరారు.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త :** నేడు రెండో శనివారం సందర్భంగా ఉదయం 8.30 నుంచి మద్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి 132కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గల 33కెవి సబ్‌స్టేషన్ల నందు, 11కెవి లైన్ల మరియు ట్రాన్స్‌ఫార్మర్ల నెలవారీ మరమ్మత్తులు నిర్వహణనిమిత్తం విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. శ్రీకాళహస్తిటౌన్, రూరల్, తొట్టంబేడు, బిఎన్‌కండ్రిగ, ఏర్పేడు, మరియు కెవిబిపురం మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని తిరుపతి విద్యుత్‌శాఖ రూరల్ ఈఈ ఎన్.వాసురెడ్డి కోరారు.

## విద్యతోనే ఆదివాసులుకు ప్రత్యేక గుర్తింపు : కమిషనర్

**శ్రీకాళహస్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త :** విద్యతోనే ఆదివాసులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తల్లిదండ్రులు తమ బిడ్డలను చదివించినట్లయితే ప్రభుత్వ కొలువుల్లో చేరవచ్చని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీల దినో త్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని భరద్వాజ తీర్ధంలో ఉన్న గిరిజన కాలనీలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా కార్యక్రమానికి ఎంపిడిఓ షరిఫ్ హాజరయ్యారు. గిరిజన కాలనీలో పలువురు ప్రజలు డ్రైనేజీ కాలువలు లేవని వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు వివరించారు.పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఊరంతటిదీ ఒకే మాట...ఒకే త్రివర్ణ పతాకం..

**పుంగనూరు,ఆగస్టు 8 ప్రభాతవార్త :**

స్వాత్ర ంత్ర్య,గణతంత్ర దినోత్సవాలను ఇకపై ఎవరికి వారే కాకుండా ఊరు ఊరంతా ఒక్కటిగా నిలచి నిర్వహించు కోవాలని, వందల మీటర్ల పొడవుకల ఒకే జెండాను చేతపట్టాలని పుంగనూరు యువజనం నిర్ణయించింది. ఎపుడూ ప్రజాసేవకు ముందుండే లయన్స్,రోటరీ,హిందూసత్యధర్మ దివ్యజా ్ఞన జ్యోతి, సంస్థలతో పాటూ బిజెపి మరిన్ని పార్టీలు ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి ముందుకు వచ్చాయి. ఈమేరకు పట్టణంలో కులమత, పార్టీ, వర్గ,విచక్షణ లేకుండా అందరూ ఒక్కటిగా నిలబడి అతిపెద్ద ర్యాలీ నిర్వహించాలని, దేశమాత పండుగను నిర్వహించుకోడానికి భేషజాలు వదలి జెండాపండుగ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమాలో రాజారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, వెంకటేష్, ముత్యాలు,టివిఎస్ ప్రసాద్,నారాయణరెడ్డిలతోపాటూ పలువురు పాల్గొన్నారు.

## మార్గదర్శకత్వం లేక యువత చెడుతోవ పడుతున్నారు



**రేణిగుంట, ఆగస్టు 9 ప్రభాతవార్త:** యువకులకు సరైన దశ దిశ నిర్దేశకత్వం సూచించే మార్గదర్శకులు లేకపోవడం వల్ల తప్పుతో పడుతున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా అన్నారు. రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో స్టార్ క్రికెట్ అకాడమి బి.సురేష్ ఆధ్వర్యంలో యువతకు సరైన మార్గదర్శకత్వం సూచించడానికి ఆర్గనైజేషన్‌ను శుక్రవారం రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ యువకులకు చదువులతో పాటు క్రీడల గొప్పతనాన్ని వివరించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శరీర దారుధ్యాన్ని పెంపొందిస్తుందని తద్వారా మనసు ప్రశాంతంగా మారి చదువులపై ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఇందిరాదేవి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన ఆచార్యులు విష్ణువర్ధని, బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఆచార్యులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓంశక్తి ఆలయంలో వైభవంగా ఆడి శుక్రవారం

**నగరి, ఆగస్టు 9 ప్రభాతవార్త:** నగరి పట్టణంలో వెలసి ఉన్న ఆది పరాశక్తి ఆలయంలో ఆడి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పర్వదినాన్ని పట్టణంలోని భక్తులు పరిసర ప్రాంత భక్తులు అశేషంగా పెద్ద సంఖ్యలో గంజి పాత్రల్లో అమ్మవారికి అంబలి పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మాజీ అడిషనల్ సూపరింటెండెంట్ పోలీసు పాలేగారు కోసలరాం, గంజి కలశం ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహచర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన స్థానిక దాతలకు మున్సిపల్ శాఖ శానిటరీ అధికారులకు, నగరి పోలీసు శాఖ వారికి పీసీఎన్ ఉన్నత పాఠశాల సిబ్బంది సహకారానికి ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## తాతాసొరకాయులస్వామి 122 మహా గురుపూజోత్సవం



నారాయణవనం, ఆగస్టు 9 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో అవదూతగా భక్తుల మన్ననలను పొందుతున్న తాతాసొరకాయులస్వామి 122వ మహాగురుపూజోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం రాత్రి స్వామివారిని ట్రాక్టర్‌పై అధిరోహించి గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్వామి వారిని దర్శనం చేసుకున్నారు.

## తిరుచ్చివాహనంపై పద్మావతీ సాక్షాత్కారం

**నారాయణవనం, ఆగస్టు 9 ప్రభాతవార్త :** నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారంతో భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడికి ఘన సన్మానం

రామచంద్రాపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త: జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడును బిజెపి మండల అధ్యక్షుడు జనార్ధన్ నాయుడు ఆధ్వర్య ంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. స్థానిక మీడియా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించగలదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శివశంకర్ రెడ్డి, గోపినాధ్ రెడ్డి, ప్రసాద్, మునెయ్య, ఛండీశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మహారాజపురంలో తమిళనాడు వాసి మృతి!

**విజయపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త:** మండలంలోని ఆంధ్ర సరిహద్దు ప్రాంతం మహారాజపురం సమీపంలో తమిళనాడు వాసి భాస్కరన్(53) మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసు కథనం మేరకు... తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా తామరపాకానికి చెందిన మృతుడు విద్యుత్ శాఖలో సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడు మూడు రోజుల క్రితం భార్య ఉష ఇంటికి కావేరి రాజపురం వెళ్లాడు. మూడు రోజుల క్రితం కనకమ్మసత్రం వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల బంధువుల ఇంట్లో, పరిసరాల్లో వెతుకుతుండగా మహారాజపురం మద్యం షాపు వెనుక మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య ఫిర్యాదుఎస్ఐ జయప్ప కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## రేషన్‌షాపుల ద్వారానే సక్రమంగా బియ్యం అందజేస్తాం



**పుత్తూరురూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** అర్హులందరికి రేషన్‌షాపుల ద్వారానే బియ్యం, నిత్యావసర సరకులు అందజేస్తామని మాజీ మున్సిపల్ చైర్మన్ యుగంధర్, విక్కీరాయల్ తెలిపారు. పట్టణంలోని 24వ వార్డులో 1వ షాపును నూతనంగా రేషన్ షాపును శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ యుగంధర్, విక్కీ, వార్తలరజని, మురళి, నాగరాజు, బాలాజీ, సుబ్రహ్మణ్యం, పద్మనాభం, భరత్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరు తహసీల్దార్‌గా జేసీ వెంకటేశ్వర్లులు

**పుత్తూరురూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** పుత్తూరు తహసీల్దార్‌లో జేసీ వెంకటేశ్వరులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయనను సన్మానించారు.



## ఎంసిపి డిపార్ట్మెంట్‌లో ఉపకులపతి ఆకస్మిక తనిఖీలు



**తిరుపతి విద్య, ఆగస్టు 9 ప్రభాతవార్త :** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎంసిఏ డిపార్టుమెంటును ఇంచార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, ఆఫీసులను పరిశీలించి ఆచార్యలకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు గైర్హాజరు, వారి సమస్యలపై ఆరా తీసారు.తరగతులు, ల్యాబులు క్రమశిక్షణగా జరగాలని తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం

**తిరుపతి విద్య, ఆగస్టు 9 ప్రభాతవార్త :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో సోషల్ వర్క్ విభాగం యొక్క విద్యార్థినిలు ఫీల్డ్ వర్క్ ప్రాక్టీస్ చేస్తున్న గిరిజన గ్రామాల్లో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంను సాయి చంద్రిక, ప్రొ. వి. ఉమ మెంటార్షిప్‌లోనూ, పూర్ణిమ, గీత, డా. తవిత తులసి మెంటారుగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమం తిరుపతి స్కేవెజర్స్ కాలనీలోని యానాది కమ్యూనిటీ గిరిజనులు వారి వెనుకబాటు తనాన్ని రూపుమాపేందుకు వారి విద్యా కోర్సులోని భాగంగా ప్రతి బుధవారం, శుక్రవారం క్షేత్ర పరిశీలనకు వెళుతూ వారికి విద్యా, వైద్యం ఇతర ఆర్థిక, సాంఘిక సమస్యల పరిష్కారం, అవగాహన కలిపిస్తుంటారు. ఈ కార్యక్రమంలో అక్కడి పాఠశాల, ఉపాధ్యాయులుతో సహా అంగన్వాడి వారు ప్రజలు పాల్గొన్నారు.



## తల్లిపాలు సంపూర్ణ పౌష్టికాహారం



**తిరుపతి విద్య, ఆగస్టు 9 ప్రభాతవార్త :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యా లయంలో ఎన్ఎస్ఎస్ ఆర్గానిక్ కెమిస్ట్రీ సహకారంతో తల్లిపాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ సి. సింధూరి విద్యార్థులతో చర్చించా రు. ప్రతి సంవత్సరం చిన్న పిల్లలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ప్రపంచ దేశాలు నిర్ణయించాయి. ఆగస్టు మొదటి వారాన్ని బ్రెస్ట్ ఫీడింగ్ వీక్‌గా అవగాహన కార్యక్రమాన్ని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. తల్లి బిడ్డ మధ్య అనుబంధాన్ని పెంచేవి తల్లిపాలు, పోషకాహారం పిల్లలకు చాలా మంచిది. తల్లిపాలు వాళ్లకు సమతుల్య పోషకాలు అందిస్తాయి. కావాల్సిన విటమిన్స్, ప్రొటీన్స్, ఫ్యాట్ వంటివి తల్లిపాల వల్లే పిల్లలకు లభిస్తాయి. తల్లిపాలు శిశువులకు ఆరోగ్యం, సురక్షితం, సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తారు. ఈ కార్యక్రమంలో డా. పి. సంధ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఆర్గానిక్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో జరిగింది. అలాగే ప్రొఫెసర్ఎ.శ్రీదేవి,డాక్టర్.మయూరి,డాక్టర్.సౌమ్య, డాక్టర్. హిమగిరిష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## తరిగొండ వెంగమాంబ సమాధికి నీడ ఏది

**తిరుపతి హెల్త్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆయుధం నందకం నుండి ఉద్భవించిన అన్నమయ్య శతాబ్దాల క్రితం ఎన్నో వేల సంకీర్తనలు పాడిన తాళ్లపాక అన్నమాచార్యుల వారసురాలిగా గ్రామ గ్రామాలకు తిరిగి సంకీర్తనలతో శ్రీవారి కీర్తిని పెంచే దిశగా పయనిస్తున్న కొండవీటి జ్యోతిర్మయికి టిటిడి బోర్డు సభ్యురాలిగా అవకాశం ఇవ్వాలని జ్యోతిర్మయి అభిమానులు శివలక్ష్మి, వనజమ్మ, లక్ష్మీనరసమ్మలు కోరారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియా ముందు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తూ సర్వేజనా సుఖినోభవంతు లక్ష్యంగా గ్రామ గ్రామాలు తిరిగి అందరూ బాగుండాలని తిరుపతి, చిత్తూరు, అనంతపురం జిల్లాలలో తిరిగి గోవిందుని నామాలతో శ్రీవారి భక్తిని జ్యోతిర్మయి ప్రచారం చేస్తున్నదని తెలియజేశారు. ఇది అమ్మ మనసులోని మాట కాదని, అమ్మవారి అభిమానులుగా తామంతా కోరుకుంటున్నామని మీడియాకు తెలియజేశారు.



# తిరుపతి డివిజన్

## మండలంలో భూ సమస్యలను పరిష్కరించండి



**తొట్టంబేడు, ఆగస్టు 9 ప్రభాతవార్త :** మండలంలో భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ నాయకులు శనివారం తహశీల్దార్ మధుసూధన రావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, మండల కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ తొట్టంబేడు మండలంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత రెవెన్యూ అధికారికి విన్నవించారు. మండలంలో గ్రామాల వారీగా భూసమస్యలు ఎన్నో ఉన్నాయని తొట్టంబేడు, కారాకొల్లు, బోనుపల్లి, చేమూరు తదితర గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని వాటదిని వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ధనంజయులు, బాబు, చంద్రశేఖర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బయ్యకు సత్కారం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త :** ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవ సందర్భంగా తిరుపతి గిరిజన భవన్‌లో యానాదుల సంక్షేమం కోసం నిత్యం పోరాటం చేస్తున్న శ్రీకాళహస్తికి చెందిన తిరుపతి పార్లమెంటు యస్‌టి సెల్ అధ్యక్షులు యం.సుబ్బయ్యను డిఆర్‌ఓ కె.పెంచలకిషోర్ మరియు డిటిడబ్యుఓ వెంకటరమణను సత్కరించారు.



## బాల్యవివాహాలు బాలికల ప్రగతికి అవరోధాలు



**శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** బాల్యవివాహాలు బాలికల ప్రగతికి అవరోధాలు అని సిడిపిఓ శాంతిదుర్గ అన్నారు. మండలంలోని కుంటిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తూరు గ్రామంలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వయస్సు గల అమ్మాయిలకు, 21సంవత్సరాల లోపు ఉన్న అబ్బాయికి వివాహం చేయడం వల్ల శారీరకంగా ఎదుగుదల లేకపోవడం వల్ల కాన్పులు కష్టమవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, యుక్తవయస్సు బాలికలు, బాలింతలు, గర్భిణీస్త్రీలు హజరయ్యారు.

## సమాచార కేంద్రంగా కృష్ణారెడ్డి మండపం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన పట్టణ నడిబొడ్డులోని పురాతన కాలం నాటి మండపానికి కృష్ణారెడ్డి మండపం అనే పేరుంది. దేవస్థానం సమాచార కేంద్రం అని బోర్డు ఏర్పాటు చేసారు. అయితే గత పాలకులు ఆ మండపం తమ పూర్వీకులదని అక్కడ బోర్డు ఏర్పాటు చేసారు. ఐదేళ్ళ పాటు ఇక్కడ గతం లో ఉన్న సమాచార కేంద్రంను తొలగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు సమాచారం ఇవ్వ టంలో ఎంతో ఉపయోగపడే ఈ మండపం కూడలిని కొంత కాలం దేవస్థానం సమాచర కేంద్రం కూడలి అని పిలిచే వారు. అలాంటి మండపంను ఐదేళ్ళుపాటు తాళాలు తగిలించి పెట్టారు. ఎవరు ఎన్ని చెబు తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఎన్ని విమర్శలు వచ్చినా దేవస్థానం అధికా రులు తిరిగి చూడలేదు. పట్టణ నడిబొడ్డులో ఉన్న మండపంలో 'సెంట్రల్ రిసెప్షెన్' ఏర్పాటు చేసే ప్రయో జనకరంగా ఉంటుందని భావిస్తున్నారు. అంతేకాక ఇక్కడ భక్తులకు సదుపాయంగా బీరువాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.



## గజ్జెకట్టి నాట్యమాడిన చిన్నారులు

**-తకిదిమితోం..తకిదిమితోం నినాదంతో మహతి పులకింత**



**తిరుపతిటౌన్,ఆగస్ట్ 9ప్రభాతవార్త:** కనుమరుగైపోతున్న కళలను కాపాడుకుని, కళాకారులను ప్రోత్సహించడానికి రాయలసీమరంగస్థలి శ్రీకృష్ణదేవరాయ జాతీయ సంగీత సాహిత్యనృత్యోత్సవాలు ఘనంగా నిర్వహిస్తోంది. తిరుపతి మహతి కళాక్షేత్రంలో మూడురోజులు జరిగే జాతీయ నృత్యోత్సవాలు శుక్రవారం ఉదయం లలితాంబికా నృత్యాలయంకు చెందిన హరిణి, హర్షిణి నృత్యప్రదర్శనతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు కెఎన్ రాజ, సుబ్రమణ్యంరెడ్డి, చెంగారెడ్డి, కొత్తపల్లిమునిరత్నం పాల్గొని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు.

## రూ.36లక్షల విలువైన...కాలం చెల్లిన మద్యం ధ్వంసం

**తిరుపతిటౌన్,ఆగస్ట్ 9ప్రభాతవార్త:** అక్రమంగా ఇతర రాష్ట్రాల నుండి తిరుపతికి తరలించిన పలు రకాల పరిమాణాల మద్యం బాటిళ్ళను సీజ్‌చేసి ,కాలం చెల్లినవాటిని శుక్రవారం తిరుపతిలో ధ్వంసం చేశారు. సుమారు 36లక్షలు రూపాయలు విలువైన క్వార్టర్, హాఫ్, ఫుల్ మద్యం బాటిళ్ళ 27,568బాటిళ్ళను తిరుపతి జిల్లా పోలీసులు, ఎస్ఈబి పోలీసులు సమక్షంలో రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. మద్యం అక్రమరవాణాపై నిరంతరం నిఘా ఉంటుందరి ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ అదనపుఎస్పీలువెంకట్రావు,కులశేఖర్, సెబ్ రాజేంద్ర, ఎక్సైజ్ విభాగం పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా ధ్వజారోహణము

**ఏర్పేడు, ఆగస్టు9 ప్రభాతవార్త;** మండలంలోని పాపానాయుడుపేట గ్రామంలో వెలసిన శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామి దేవస్థానము 154వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేనేత సంఘం వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ధ్వజారోహనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## పాపానాయుడుపేట విద్యార్థుల ప్రతిభ

**ఏర్పేడు, ఆగస్టు9 ప్రభాతవార్త :** మండల కేంద్రం ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా దేశభక్తి గేయాల పాటల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి రవి కుమార్, అలాగే సీనియర్స్ విభాగంలో పదవ తరగతి విద్యార్థిని ప్రతిమ ఇద్దరూ మొదటి స్థానాలను కైవసం చేసుకున్నారు. అలాగే క్విజ్ పోటీలలో పాల్గొన్న సుప్రజ, వైశాలి, భవ్య, విగ్నేష్ విద్యార్థులు తృతీయ స్థానం కైవసం చేసుకున్నందుకు గైడ్ ఉపాధ్యాయులు నవీన్ కుమార్, రాజేంద్ర, వెంకటరమణ తదితర ఉపాధ్యాయులు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

## రేణిగుంట తహసీల్దార్‌గా వి.సురేష్‌బాబు



రేణిగుంట, ఆగస్టు 9 ప్రభాతవార్త: రేణిగుంట తహసీల్దార్‌గా వి.సురేష్ బాబు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అనంతరం టీడీపీ భాగస్వామ్య ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేణిగుంట మండల తొలి తహసీల్దార్‌గా వి.సురేష్‌బాబు బదిలీపై వచ్చారు. అప్పటి వరకు రేణిగుంట తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన నాగేశ్వరరావు కడప జిల్లాకు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత సురేష్‌బాబును టీడీపీ జిల్లా అధ్యక్షుడు, చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, టీడీపీ యువ నేతలు అడ్వకేట్ ఉదయకుమార్‌రెడ్డి, బీజేపీ యువ నాయకులు పూల వెంకటాద్రి యాదవ్, పలు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, పుర ప్రముఖులు ఘనంగా ఆహ్వానం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## ప్రజాయోధునీ మృతికి సంతాపం

**రేణిగుంట, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ప్రజా యోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సీనియర్ నాయకులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధ దేవ భట్టాచార్య మృతిపట్ల సీపీఎం పార్టీ నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ ఒక మహాయోధుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఓ.వెంకటరమణ, సీపీఎం పార్టీ కార్యదర్శి హరినాథ్, ఈశ్వరి, దిలీప్ బాషా, వెంకటరమణ, కుప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.



## మహాభారత ఉత్సవంలో గురూజీ ఆశ్రమం అన్నదానం

**రామచంద్రాపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త:** సి.రామా పురంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలలో 2వరోజు శుక్రవారం శ్రీసిద్దేశ్వరతీర్ధం బ్రహ్మర్షి బ్రహ్మానంద గురువానంద గురూజీ ఆశీస్సులతో అన్నప్రసాద వితరణ గావించారు. అర్చకులు మార్కండేయులు ద్రౌపధి అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొపి సుగంధపరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ నెల 26న మహాభారత ఉత్సవాల వరకు ప్రతిరోజు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆశ్రమ మేనేజర్ రాంప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిరామిరెడ్డి, రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# మోటరు వాహన చట్ట సవరణలపై ప్రజలకు అవగాహన

- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు



చిత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త: మోటర్ వాహన చట్టంలోని సెక్షన్ 200ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మోటర్ వాహనాల చట్టంలోని సెక్షన్ 200ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం తయారు చేసిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు నేషనల్ కన్స్యూమర్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ హరిబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మోటర్ వాహనాల చట్టంలోని సెక్షన్-200ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, జూన్ 1 నుండి నూతన మోటరు వాహనాల చట్టం నిబంధనలు అమలులోకి వచ్చాయని, గతంలో వున్న చట్టం కంటే నూతన చట్టంలో నిబంధనలు కఠినంగా వున్నాయన్నారు. గతంలో జరిమానాలతో సరిపెట్టేవారని అయితే ప్రస్తుత నూతన చట్టంలో జరిమానాలతో పాటు అదనంగా జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు చేశారన్నారు. వీటిని ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. నూతన చట్టం ప్రకారం ఎవరైనా మైనర్ వాహనం నడిపితే తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు మూడేళ్ళ పాటు జైలు శిక్ష, 25 వేల రూపాయల జరిమానా విధిస్తారన్నారు. అలాగే అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేలు జరిమానా చెల్లించాల్సి వుంటుందన్నారు.

## 18న కాళ్ళలో సిరల వాపు వ్యాధికి ఉచిత వైద్య శిబిరం

-ఉచిత మెగా వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతిరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త: భవనేష్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ ఆధ్వర్యంలో ఈనెల 18న మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కన్‌స్ట్రక్షన్స్ ఎం.డి.మల్లికార్జున తెలిపారు. ముఖ్యంగా వేరికోస్ వెయిన్స్ (కాళ్ళలో సిరల వాపు వ్యాధి)పై వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరానికి సంబంధించి పోస్టర్‌ను శుక్రవారం భవనేషన్ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.విజయకుమార్ మాట్లాడుతూ ఈనెల 18న ఆదివారం గంటలకు భవనేష్ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే వేరికోస్ వెయిన్స్ ఉచిత మెగా వైద్య శిబిరంలో మెగావిన్ ఎండి డాక్టర్ వినయ్ న్యాపతి, డాక్టర్ హరీష్ రాజకుమార్ ఇతర వైద్య సిబ్బంది పాల్గొని సేవలు అందిస్తారని తెలిపారు. విశ్రాంతి సూపరింటెండెంట్ డాక్టర్ కె.బాలశంకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి ప్రాంతంలో వేరికోస్ వెయిన్స్ బాధితులు ఎక్కువగా ఉన్నారని, బెంగుళూరు, చైన్నెల నుంచి వచ్చే నిపుణులైన డాక్టర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ గిరిధర్, సురేష్‌వర్మ, పళణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

-నారాయణ కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ




గూడూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త : ఉన్నత స్థాయికి ఎదగడానికి ఇంజనీరింగ్ విద్యార్థి దశ ఎంతో ముఖ్యమని నేడు ఉన్న పోటీ ప్రపంచంలో విద్యతో పాటు స్కిల్ డెవలప్మెంట్ ఎంతో ముఖ్యమని నారాయణ కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ అన్నారు. గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా బీటెక్‌లో చేరిన విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులతో యాజమాన్యం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ నేడు ఉన్న పోటీ ప్రపంచంలో ఎంతో కష్టపడి చదువుకుంటేనే ఉన్నత స్థాయికి వెళ్లారని విద్యతో పాటు స్కిల్స్ డెవలప్మెంట్ క్రమశిక్షణ ఎంతో అవసరం అని అన్నారు. నారాయణ ఇంజనీరింగ్ కళాశాలపై నమ్మకంతో మా కాలేజీని ఎంపిక చేసుకున్నందుకు అభినందనలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రవి ప్రసాద్ మాట్లాడుతూ నారాయణ కళాశాల విలువలతో కూడిన విద్యను అందిస్తుందని విద్యార్థులు కూడా ఎంతో క్రమశిక్షణతో నాలుగు సంవత్సరాలు విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థాయికి వెళ్తారని సూచించారు. ఈ సమావేశంలో దశరథ రామయ్య, నీరజ, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

-పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



తవనంపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త: మండలంలోని అరగొండ గ్రామ పంచాయతీ పైమాఘం గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే మండల టీడీపీ నాయకులతో కలసి పైమాఘం దళితవాడలో శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక సర్పంచ్ మల్లుదొరై ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో త్రాగునీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలని, స్మశానంకు దారి కల్పించాలని, నూతనంగా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మురళీమోహన్ స్పందిస్తూ గ్రామంలో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు దిలీప్, మోహన్‌నాయుడు, సునీల్ చౌదరి, జెట్టిపల్లె శ్రీనివాసులు, అమరేంద్రనాయుడు, భాస్కర్‌నాయుడు, చిట్టెమ్మ, గాంధీ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాళీమాత కుంభాభిషేకం పూజల్లో ఎమ్మెల్యే :**

మండలంలోని వెంగంపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకాళీమాత అమ్మవారి ఆలయ కుంభాభిషేకం వేడుకల్లో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. గ్రామస్థులు ఆహ్వానం మేరకు ఆయన మండల టీడీపీ నాయకులతో కలసి ఈవేడుకల్లో పాల్గొని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## నిర్దేశించిన లక్ష్యాలు సాధించడానికి పక్కా ప్రణాళిక

- కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్లతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



చిత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త: కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచి మేనేజర్లకు నిర్దేశించిన డిపాజిట్లు, ఋణాల పంపిణీ, రికవరీ లక్ష్యాలు సాధించడానికి పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు శుక్రవారం డిసిసిబి బ్యాంకు మేనేజర్లతో డిపాజిట్ల సేకరణ, ఋణాల పంపిణీ, ఋణాల రికవరీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు సంబంధించి 2024-25 సంవత్సరానికి డిపాజిట్ల లక్ష్యం రూ.1,114 కోట్లు నిర్దేశించగా జులై 31 నాటికి బ్యాంకు డిపాజిట్లు 908.46 కోట్ల రూపాయలు సాధించిందన్నారు. అలాగే డిసిసిబి ఋణాల పంపిణీ లక్ష్యం 2,500 కోట్ల రూపాయలు నిర్దేశించగా జులై 31 నాటికి 1,996.05 కోట్ల రూపాయల ఋణాల పంపిణీ పూర్తి చేసిందన్నారు. అలాగే 2024 జూన్ 30 నాటికి బ్యాంకు నందు నిరర్ధక ఆస్తులు 2.83 శాతంగా వుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిసిసిబి జిఎం మనోహర్‌గౌడ్, జిఎం శంకర్‌బాబు, జిఎం జెఎం లిల్లీకేథరిన్, డిజిఎంలు, ఎజిఎంలు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## ఫ్యూయల్ స్టేషన్ ఎంఎల్ఏచే ప్రారంభోత్సవం.!



చంద్రగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త : చంద్రగిరి మండల పరిధిలోని కల్‌రోడ్‌పల్లి సమీపంలో జాతీయ రహదారి ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన సాయి సద్గురు ఫ్యూయల్ స్టేషన్‌ను శుక్రవారం ఎంఎల్ఏ పులివర్తి నాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఐతేపల్లికి చెందిన క్లాస్ 1 కాంట్రాక్టర్ ఏ.వి.రమణమూర్తి నూతన ఈ పెట్రోల్ బంక్‌ను నిర్మించారు. ఇందులో భాగంగా ఇక్కడికి చేరుకున్న ఎంఎల్ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినీల్‌కు ఏ.వి.రమణమూర్తి, మాజీ డ్పీటిసి సరిత దంపతులు, ఎంపిటిసి ఏ.సి.శేఖర్ దంపతులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ చేతుల మీదుగా ఫ్యూయల్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ఏజి పల్లి బాల, గౌస్‌భాషా, లోకాద్రి నాయుడు, చెంచయ్య, వలపల దశరథ నాయుడు, హేమాంబరదర రావు, తదితరులు పాల్గొన్నారు.

## పరిపూర్ణులై అమ్మవారికి ప్రణమిల్లిన పులివర్తి దంపతులు



చంద్రగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గ ఎంఎల్ఏగా విజయం సాధించి పరిపూర్ణులైన పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి దంపతులు శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి కుంభాభిషేక మహోత్సవ సేవలో ప్రణమిల్లి పునీతులయ్యారు. సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయాన్ని సుమారు రూ.8 కోట్లు వ్యయంతో పునఃనిర్మించారు. ఈ నేపధ్యంలో మూడు రోజుల పాటు పండుగ వాతావరణంలో అమ్మవారి పునఃనూతన ఆలయ యంత్రశిఖర ప్రతిష్ట సహిత శతచండీ సహిత సహస్ర కలశ కుంభాభిషేక మహోత్సవాన్ని ఎంఎల్ఏ దంపతులు, నియమనిష్టలతో నిమగ్నులై భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. ఈ పూజాధి కార్యక్రమంలో రామచంద్రాపురం మండలానికి చెందిన ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ వేదపండి తులతో కలసి పాలుపంచుకున్నారు. తిరుపతికి చెందిన సంకల్ప హాస్పిటల్ బండ్ల సోమేశ్వర ఆధ్వర్యంలో ప్రధమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ కుంభాభిషేక మహోత్సవంలో అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

## వైభవంగా ధ్వజారోహణం



పుత్తూరురూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో గోపూజ శ్రీకృష్ణ భగవానునికి భక్తులచే పాలాభిషేకం ఉభయ దాతలుగా కీర్తిశేషులు దివ్యల దాసరి మండడి భార్య శ్రీమతి రేణుకమ్మ, వగైరాలు, బెస్త వీధి పుత్తూరు, గాలి నాగరాజు యాదవ్(నెత్తం), ఉదయం పాలాభిషేకం ప్రసాద్ వినియోగం నిరీష, కె.అయ్యప్పరెడ్డి పుత్తూరు సాయంత్రం ప్రసాద వినియోగం శ్రీ పసుపులేటి నాగమణి వెంకటాచలపతి పుత్తూరు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆలయ ఆవరణలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉభయ దాతలు పుత్తూరు పట్టణానికి చెందిన కె.హర్షవర్ధన్, కె.హేమ, కె.సి.ఉమామహేశ్వర్, జమునారాణి, కృష్ణబేకరి ఉమన్ క్యాటరింగ్ వారిచే పసుపు కుంకుమ పసుపు దారాలు కుంకుమ జాకెట్‌ప్రసాదాలు వితరణగా అందించారు. రాత్రి ప్రసాద్ వినియోగం దాత ఏకే వాసు కూరగాయల మార్కెట్ పుత్తూరు, ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## తిరుపతి జిల్లాలో...లూప్‌లైన్ సిఐలకు పోస్టింగ్‌లు

-11మంది సిఐలు బదిలీ

తిరుపతి,ఆగస్ట్ 9ప్రభాతవార్త: రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా రేంజ్‌పరిధిలో చేపట్టిన సిఐల బదిలీల్లో పలువురు లూప్‌లైన్‌లో సిఐలకు సర్కిళ్ళకు పోస్టింగ్ కల్పించింది. గత ఐదారేళ్ళు, పదిసంవత్సరాలుగా ఏకధాటిగా లూప్‌లైన్‌లోనే సేవలందిస్తూ వచ్చారు. రాష్ట్రంలో జరిగిన 41మంది సిఐల బదిలీల్లో 11మంది తిరుపతి జిల్లాలోనే ఉండటం విశేషం. తిరుపతి మహిళ స్టేషన్ సిఐ శరత్‌చంద్రను రేణిగుంట అర్బన్‌కు, టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న సిఐ బి.సుబ్బరాయుడును రేణిగుంట రూరల్‌కు, తిరుపతి కల్యాణిడ్యామ్ పిటిసిలో ఉన్న సిఐలు ఎం.మురళీని సత్యవేడుకు, మహేశ్వర్‌ను నగరికి, ఎ.శ్రీరాములు తిరుపతి ట్రాఫిక్ నుండి డిటిసికి, పి.జగన్మోహన్‌రెడ్డి టిడిసి నుండి విఆర్ఎస్‌పి అనంతపురంకు, టి.మల్లికార్జున రేణిగుంట నుండి విఆర్ఎస్‌పి తిరుపతికి, పి.రామకృష్ణను అన్నమయ్యజిల్లా నుండి తిరుపతి వెస్ట్‌సిఐగా, కె.రెడ్డిశేఖర్‌రెడ్డి తిరుమల క్రైమ్ నుండి విఎస్ఆర్ఎస్‌పి తిరుపతికి, కె.వెంకటరమణ తిరుపతి ట్రాఫిక్‌కు ,డి.గోపీ కర్నూలు విఆర్ఎస్‌పి నుండి శ్రీకాళహస్తి 1టౌన్ సిఐగా నియమి తులయ్యారు. వీరంతా రెండురోజుల్లో ఆయా చోట్ల రిపోర్టుచేసుకోవాలని డిఐజి పేర్కొన్నారు.

## మరోసారి మాజీ ఎంపిటిసి ఆస్తుల ధ్వంసం

- దేశం పేరు చెప్పి ఆగడాలు





పుంగనూరు,ఆగస్టు 8 ప్రభాతవార్త : మాజీ ఎంపిటిసి హేమచంద్రకు చెందిన భూములపై మరోసారి గురువారం రాత్రికూడా దుండగులు దాడులు చేశారు. మాజీ ఎంపిటిసి,జిల్లా వడ్డెరసంఘ అధ్యక్షుడు హేమచంద్ర 2019లో బైపాస్‌రోడ్డువద్ద వెంకట రమణ, రత్నమ్మ, నవీవన్, పవిత్రమ్మల వద్ద భూ మిని కొని రిజిస్ట్రేషన్‌చేసుకున్నారు. అయితే ఆయనకు గతంలో ప్రత్యర్థిగా పోటీచేసిన అదేగ్రామానికి చెందిన గంగులప్ప అనే వ్యక్తి తెలుగుదేశం పార్టీపేరు చెబుతూ హేమచంద్రతో బేరసారాలకు దిగాడు. బైపాస్‌రోడ్డుకు ఉన్న హేమచంద్రను బ్లాక్‌మెయిల్ చేయడానికి కొందరు వ్యక్తులను కూడా ఏర్పాటుచేశాడు. ఈక్రమంలో హేమచంద్ర తన ఆస్తికి చెంది ఎవరితోనే బేరసారాలు చేసుకునే అవసరంలేదని తిప్పికొట్టాడు. ఇందుకు గంగులప్ప కొందరు వ్యక్తులను తీసుకువెళ్ళి జెసిబిలతో హేమచంద్ర ఆస్తులకు వేసుకున్న ప్రహరీను బుధవారం రాత్రి కూల్చివేశాడు. ఈవిషయం అన్ని పత్రికలలో ప్రముఖంగా రావడంతో కక్షతో గురువారం రాత్రి కూడా మరింత గోతులు తీసి ప్రహరీను కూల్చిశారు. కొట్ల విలువైన భూమిలో బేరాలాడితే తనకు కొంత శాతం ముట్టచెప్పాలని,లేని పక్షంలో బతకనివ్వమని కూడా బయట బాహాటంగా కొందరు హేమచంద్రను బెదిరించినట్లు తెలుస్తోంది. ప్రతిదాడులు,దుర్మార్గపు వ్యవహారాలకు దూరంగా ఉండాలని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చినా, తెలుగుదేశం నాయకుల పేర్లుచెప్పి గంగులప్ప ఈదారుణాలకు పాల్పడుతున్నాడని,దీనిపై పుంగనూరు సిఐ,ఎస్‌లకు ఫిర్యాదు చేశామని, జిల్లా ఎస్పీను కలసి ఫిర్యాదుచేయనున్నట్లు హేమచంద్ర తెలిపారు.

## 20విద్యుత్ స్టాటర్లు మాయం...లబోదిబో మంటున్న రైతులు



ఏర్పేడు, ఆగస్టు 9ప్రభాతవార్త; సినీ పక్కీలో ఒకే రోజు రాత్రి పలువురు రైతులకు చెందిన 20 విద్యుత్ ఆయిల్ స్టార్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరిం చుకొని వెళ్లిన సంఘటన శక్రవారం ఉదయం ఇసుకతాగేలి గ్రామ వ్యవసాయ పొలాల్లో చోటు చేసుకుంది. స్థానిక రైతుల కథనం మేరకు గురువారం సాయంత్రం వరకు పొలాలవద్ద పశువులను మేపుకుంటూ ఇంటికి వచ్చామని తెలిపారు. మరుసటి దినం శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లి బోరు బావి వద్ద మోటారును వేసేందుకు స్టార్టర్ బాక్సుని తెరవగా అందులో ఉన్న విద్యుత్ ఆయిల్ స్టార్టర్ కన్పించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిదంగా చుట్టుప్రక్క ఉన్న రైతులకు చెందిన 20విద్యుత్ ఆయిల్ స్టార్టర్లు చోరికి గురి అయ్యాయని రైతులు లబోదిబోమన్నారు. వరి పంటలు పొట్ట దశ, పాలు పోసుకునే దశలో ఉన్నాయని తెలిపారు. ఒక ఆయిల్ స్టార్టర్ దానికి సంబంధించిన వైర్ల విలువ సుమారు రూ.5వేల రూపాయలు ఉంటుందని, ఇప్పుడు పంటలను కాపాడు కోవాలంటే అప్పులు చేసి స్టార్టర్లను అమర్చుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఇదే విదంగా గత పది రోజుల క్రిందట మాధవమాల గ్రామంలో కూడా విద్యుత్ ఆయిల్ స్టార్టర్లు చోరికి గురైనట్లు తాతేకాల్వ మనోహర్‌రెడ్డి, మునిరెడ్డి, నవీన్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ధికారులు స్పందించి విద్యుత్ స్టార్టర్లకు రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

## లక్ష్యం ఘనం... ఆచరణ శూన్యం

-దారికడ్డంగా దర్శనమిస్తున్న పూల కుండీలు



శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించుటకు గతంలో మున్సిపల్ అధికారులు తీసుకున్న నిర్ణయం లక్ష్యంమహోన్న తమైదని అయితే ఆచరణ శూన్యంగా మారిం దన్నారు. నేడు మున్సిపాలిటి వంతెనలపై ఏర్పాటు చేసిన పచ్చదనం లేని పూల కుండీలు పాద చారులకు శాపంగా మారిందన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు జలవినాయ కుని ఆలయం నుంచి పొన్నాలమ్మ గుడి వరకు ఓ వంతెన, అన్నా క్యాంటిన్ నుంచి పంచాయతీరాజ్ అతిధి గృహం వరకు మరో వంతెనను నిర్మించారు. రెండేళ్ళ క్రితం మున్సిపాలిటి పట్టణంలోని నాలుగు మాడావీధుల్లోనూ, స్వర్ణముఖి నదిపై నిర్మించిన వంతెనలపై అందంగా పూల కుండీలను ఏర్పాటు చేసారు.వాటిలో అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేసారు.

**దారికడ్డంగా పూల కుండీలు:**

మున్సిపాలిటి వచ్చే భక్తులను, ప్రయాణీకులను ఆకర్షించుటకు ఏర్పాటు చేసిన పూల కుండీలు నేడు పాదచారులకు శాపంగా మారింది.మున్సిపాలిటి కుండీలను ఏర్పాటు చేసి చక్కటి పూల మొక్కలను ఏర్పాటు చేసారు. వాటి ఆలనా పాలనా లేకుండా ఎండిపోయాయి. అయితే కుండీలు మాత్రం దిష్టి బొమ్మల్లా మారాయి. పట్టణంలో సుమారు వందకుపైగా కుండీలను ఏర్పాటు చేసారు.అవి అన్ని శిధిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా జలవినాయకుని ఆలయం నుంచి పొన్నాలమ్మ గుడి వరకు వెళ్ళు వంతెనపై ఫుట్‌పాత్‌పై పాదచారులకు ఇవి అడ్డంకిగా ఉన్నాయి. ఇక్కడ ద్విచక్రవాహనాలపై అతివేగంగా వెళ్ళు యువత, కుండీల పక్కనే జల్సాలు చేసుకునే మందుబాబులతో ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వాటిని తొలగించి పాదచారులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

## బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న తిరుమల

-రంగులు దిద్దుకుంటున్న భవనాలు



తిరుమల,ఆగస్ట్ 9 ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామికి అక్టోబర్ 4వతేదీ నుండి 12వతేదీ వరకు అంగరంగవైభవంగా జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్స వాలకు తిరుమల సిద్ధమవుతోంది. తొమ్మిదిరోజులు జరిగే దేవుని ఉత్సవాల్లో వాహనసేవల వీక్షణకు దేశం నలుమూలల నుండి అశేషసంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకుంటారు. భక్తులను ఆకట్టుకునేలా తిరుమలలో ఏర్పాట్లు మొదలయ్యాయి.

## ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో ఘనంగా అర్జున తపస్మాన్

స్వామి,అమ్మవారిని దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం



నారాయణవనం, ఆగస్టు 9 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని నారాయణ వనంలో గత ఎనిమిది రోజులుగా ద్రౌపతీదేవీ సమేత ధర్మరాజులస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల వాణివైశ్యసంఘం ఆధ్వర్యంలో ఉదయం అర్జున తపస్మాన్ సాయంత్రం ఆవుల మలేయుట కార్యక్రమం ఘనంగా జరిగింది. అంతకుముందు ఉదయం అర్జున పాత్రదారుడు 18మెట్లను ఎక్కుతూ మెట్టుకు ఒకపాటను పాడుతూ శిఖరానికి చేరడం జరిగింది. ఆ సమయంలో మహిళలు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకొని తడిబట్టలతో వర ం కోసం వేడుకున్నారు. చివరకు అర్జునపాత్రదారుడు నిమ్మకాయలను క్రిందకు వేయడంతో మహిళలు, భక్తులు ఎగబడ్డారు. సాయంత్రం వైశ్య వాణిజ్య సంఘం వారి ఆధ్వర్యంలో ఉత్తరగోగ్రహణం జరిగింది. ఈ వేడుకను తిలకించడానికి మండల నలుమూలల నుంచే కాకుండా నారాయణవనం, పుత్తూరు, పిచ్చాటూరు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సాయంత్రం 5గంటలకు కల్పవృక్ష వాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగించారు.

## ఎమ్మెల్యే చొరవతో పరిశ్రమల స్థాపనకు ముందడుగు



విజయపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త: స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మండల పరిధిలో పరిశ్రమల స్థాపనకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి, సంబంధిత మంత్రి, పరిశ్రమల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఐఏఎస్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఏపీఐఐసీ అధికారులతో కలసి విజయపురంలో పర్యటించారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థకు కోసలనగరంలో ఇది వరకే కేటాయించిన భూములకు సంబంధించి సంబంధిత రైతులకు ఇవ్వవలసిన పరిహారాన్ని అందించే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు మరో 470 ఎకరాలకు సంబంధించిన మరో బ్లాక్‌లో ఉన్న భూములను కూడా ఏపీఐఐసీకి తీసుకునేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ పర్యటనలో పరిశ్రమల శాఖ కార్యదర్శి, జిల్లా కలెక్టర్, నగరి ఆర్డీవో వెంకటరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్, విజయపురం తహసీల్దార్ కిరణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అత్యంత చొరవ తీసుకోవడం మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత తమ హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు మెరుగైన సదుపాయాలను కల్పించాలి : కలెక్టర్



బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 9 ప్రభాతవార్త: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, హాస్టళ్ళలో మెరుగైన సదుపాయాలు భోజన వసతులు కల్పించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వరరావు గురుకుల ఏకలవ్య గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గురుకుల పాఠశాలలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులను స్వయంగా విద్యార్థుల పరిస్థితులను వసతుల బోధన విధానం, హాస్టళ్ళలో భోజన వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు మావిళ్ళపల్లి సుధాకర్‌నాయుడు, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గిరిజనులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : సీనియర్ సివిల్‌జడ్జి



శ్రీకాళహస్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త : గిరిజనులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి అన్నారు. ఆదివాసీల దినోత్సవ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న లంకమిట్ట గిరిజన కాలనీలో మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్‌జడ్జి బేబిరాణి వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందించే సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించుకున్న వారికి ఉచితంగా మందులను పంపిణీచేశారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్‌సెంటర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రూపేష్ వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 12న ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

పుంగనూరు,ఆగస్టు 9 ప్రభాతవార్త : ఉపాధ్యాయుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన ఉన్నాయని, దీనిపై నూతన ప్రభుత్వంలో కదలిక కోసం ఈనెల 12న జిల్లా కేంద్రంలో మహాధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి బోడె మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం విద్యావనరుల కేంద్రం సమీపంలో ఎస్టీయు నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ళ తరబడి ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలపై ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తుండడం దారుణ మన్నారు. ఉపాధ్యాయులు పిఎఫ్‌లో దాచుకున్న డబ్బులు ఎంత ఉందో తెలుసుకునే వీలు లేకుండా వాటిని నాలుగేళ్ళక్రితం లాక్‌చేసి ఉంచారని, పిఎఫ్ స్లిప్‌లు,పిఎఫ్‌లోన్లు తరచూ ఉపాధ్యాయులను దారుణంగా ఇబ్బంది పెడుతున్న విషయాలన్నారు.ఈ సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్,జిల్లా సహాధ్యక్షుడు బుడ్డన్న,డివిజన్ కోకన్వీనర్ వెంకటరెడ్డి,శ్రీరాములు రెడ్డి,అంజప్ప, వెంకటప్ప, తులసీదాస్, మునిశేఖర్, కుమార్, బాలాజీ, రఫ, మహ్మద్‌అలీ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాకమిటీ ఎన్నికల్లో రాజకీయ జోక్యమా!

- కోరం లేకనే యాకసిరి ఎస్ఎంసి ఎన్నిక వాయిదా - మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి



చిట్టమూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త : విద్యాకమిటీ ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు పోలీసులు, అధికారులపై ఒత్తిడి తెచ్చి విజయం సాధించడం పట్ల చిట్టమూరు మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి మండిపడ్డారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఎస్ఎంసి ఎన్నికలు తెలుగుదేశం నాయకుల కనుసన్నల్లో జరిగాయని, ఇందుకు పోలీసులు కూడా తమవంతు పాత్ర పోషించి సహకరించడం సమంజసం కాదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎస్ఎంసి ఎన్నికల్లో జోక్యం చేసుకోలేదన్న సత్యాన్ని టిడిపి నాయకులు గ్రహించాలన్నారు. యాకసిరి గ్రామంలో 3వ తరగతిలో కోరం లేకనే ఎన్నిక వాయిదా పడిందే తప్ప ప్రతిపక్ష పార్టీ నాయకుల ప్రమేయం లేదన్నారు. పాఠశాలకు సంబంధించి 3వ తరగతిలో 12 మంది విద్యార్థులకు కనీసం సగంమంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కాకపోవడంతోనే వాయిదా పడిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులే ఎవరు పాఠశాలల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తారో వారే ఎన్నిక చేసుకోవాల్సి ఉన్నా చిట్టమూరు మండలంలో అధికార పార్టీ నాయకులు స్వయంగా విద్యాకమిటీ ఎన్నికల్లో తలదూర్చి విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరింపు గురిచేయడం సరికాదన్నారు. యాకసిరిలో ఎన్నిక వాయిదా పడటంపై మండల విద్యాశాఖ అధికారి బివి కృష్ణయ్య మాట్లాడుతూ తదుపరి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎన్నిక నిర్వహిస్తామని, అనంతరమే విజేతను ప్రకటిస్తామని 'ప్రభాతవార్త'కు తెలిపారు.